ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 22 ఏప్రిల్ 2025

కడప పాత బస్టాండ్ దగ్గర మద్యం దుకాణంలో సిట్టింగ్



> కూటమి అధికారంలోకి వస్తే.. జేబ్రాండ్ బదులు నాణ్యమైన మద్యం అందుబాటులోకి తెస్తామని ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకున్నారు. ఆ మేరకు దేశంలో దొరికే అన్నిరకాల బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. అయితే బ్రాందీషాపులు నిబంధనలు పాటించడం లేదు. ఎక్సైజ్, పోలీసుల సహకారంతో బ్రాందీ షాపులను బార్లుగా మార్చేశారు. ఒక్కో బ్రాందీషాపును పరిశీలిస్తే బార్లను మించి పోయే విధంగా అక్కడ సిట్టింగ్‌లు ఉండడం గమనార్హం. దీనికన్నా పర్మిట్లకు అనుమతిస్తే ఆ సొమ్ము ఏదో నేరుగా ప్రభుత్వ ఖజానాకు చేరుతుందని, తద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని అందరూ అంటున్నారు.

బ్రాందీషాపులే.. బార్‌లా..

- నిబంధనలకు నీళ్లు
- అక్కడే తాగేందుకు ఏర్పాట్లు
- రేకులషెడ్లు వేసి మరీ సిట్టింగ్
- మామూళ్లతో పోలీసు, ఎక్సైజ్ కళ్లకు గంతలు
- బ్రాందీషాపుల వద్ద మందుబాబుల జాతర
- కడపలో ఇప్పటికే ఓ హత్య
- అటు వెళ్లాలంటేనే భయపడుతున్న జనం



కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోని మద్యం దుకాణం వద్ద..

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో ప్రభుత్వమే మద్యం అమ్మకాలు చేపట్టింది. జేబ్రాండ్లను, చెత్త చెత్త బ్రాండ్లను అమ్మి ఎంతో మందిని ఆసుపత్రిపాలు చేసింది. కేవలం బార్లలో మాత్రమే అన్నిరకాల బ్రాండ్లు దొరికేవి. అయితే అక్కడ ఒక్కో క్వార్టరుపై రూ.60 నుంచి రూ.150 వరకు అదనంగా పెట్టుకోవాలి. ఈ ఇబ్బంది లేకుండా ఉండేందుకు.. ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యాన్ని ప్రైవేటు షాపుల ద్వారా విక్రయిస్తోంది. జిల్లాలో మొత్తం 151 బ్రాంది షాపులు ఉన్నాయి. ప్రతిరోజూ ఉదయం 10గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మాత్రమే విక్రయాలు జరపాల్సి ఉంటుంది. అక్కడ మందు తాగేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయకూడదు. అన్నిరకాల మద్యం బ్రాండ్లను ఎమ్మార్పీ ధరలకు మాత్రమే విక్రయించాలి. అంటే అక్కడ కొనుగోలు చేయడం, ఇంటికి వచ్చి తాగడం ఇలా ఉండాలి. ఇందుకు గాను ప్రభుత్వం 14 శాతం లైసెన్సుదారులకు కమీషన్ ఇస్తుంది.

మామూళ్లే మామూళ్లు

బ్రాందీ షాపుల్లో కేవలం అమ్మకాలే జరగాల్సి ఉంటే, అక్కడ పర్మిట్ రూము ఏర్పాటు చేసుకుని అడ్డగోలుగా తాపిస్తున్నా పోలీసు, ఎక్సైజ్ శాఖలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మద్యం అమ్మకాలు సక్రమంగా జరగడం, కల్తీ లేకుండా చూడడం, ఇతర ప్రాంతాల నుంచి మద్యం రాకుండా చూడడం కోసం ఎక్సైజ్ శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంటు, టాస్క్‌ఫోర్స్, స్టేట్ టాస్క్‌ఫోర్స్ బృందాలుంటాయి. ఇవన్నీ ప్రభుత్వ నిబంధనల మేరకు అమ్మకాలు జరిగేలా చూడాలి. బ్రాందీషాపుల వద్ద సిట్టింగులు లేకుండా చూడాలి. ఏదైనా తేడా వస్తే కేసు నమోదు చేయవచ్చు. ఇక స్థానిక పోలీసులు కూడా అక్కడ బెల్టుషాపులు లేకుండా, అనుమతికి మించి విక్రయాలు జరగకుండా చూడాల్సి ఉంది. అయితే జిల్లాలో ఆ పరిస్థితి లేదు. నెలనెలా అటు ఎక్సైజ్, ఇటు పోలీసులు భారీగా ముడుపులు తీసుకుని బ్రాందీషాపుల యజమానులకు పూర్తిగా సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో బ్రాందీషాపులు బార్‌లను తలపిస్తున్నాయి. సిట్టింగ్ కోసం రేకుల షెడ్లు, దిమ్మెలు, కూర్చునేందుకు సీట్లు ఏర్పాటు చేసి తాపిస్తున్నారు. అయినా పోలీసులకు అవి కనిపించడం లేదు. షాపు స్థాయిని బట్టి ప్రతినెలా రూ.35వేల వరకు వసూలు చేస్తున్నట్లు ప్రచారం ఉంది. కడపలో ప్రతి బ్రాందీషాపు బార్‌కు ఏమీ తీసిపోని విధంగా వసతులు కల్పించింది. ఇందుకు గాను ఒక్కో షాపు నుంచి ఎక్సైజ్‌కు రూ.35వేలు అందుతున్నాయని అంటున్నారు. అందులో ఎన్‌ఫోర్స్‌మెంటుకు, టాస్క్‌ఫోర్స్ రూ.19వేలు, స్టేట్ నుంచి వచ్చే బృందానికి రూ.6వేలు ఇస్తున్నారని సమాచారం. లైసెన్సుదారుడు రాకున్నా సరే మద్యం ఎత్తించినందుకు రూ.6వేలు, ఇక పోలీసులకు స్టేషన్ బట్టి రూ.10వేల నుంచి రూ.25వేల వరకు ఇస్తున్నారనే ప్రచారం ఉంది. కడపతో పోలిస్తే మిగతా చోట్ల కొంచెం తక్కువగా మామూళ్లు ఉన్నాయని చెబుతారు. అందుకే అడ్డగోలు విక్రయాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదంటున్నారు.

కడపలో భయం భయం

కడపలో ఒక పక్క గంజాయి బ్యాచ్, మరో పక్క మందుబాబులతో జనం భయాందోళనకు గురవుతున్నారు. నాలుగురోజుల క్రితం బిల్టప్ వద్ద అందరూ చూస్తుండగానే పాతకక్షల నేపథ్యంలో సాదిక్ అనే వ్యక్తిని కత్తితో పొడిచి, గొంతు కోసి హతమార్చారు. హత్యకు గురైన వ్యక్తి పోయిన సంవత్సరం అదే బిల్టప్ సర్కిల్‌లో ఒకరిని బీరు బాటిల్‌తో కొట్టి హత్య చేశాడు. ఇప్పుడు బిల్టప్ డేంజరస్ సర్కిల్‌గా మారిందంటారు. అక్కడ మద్యం మత్తులో మందుబాబులు నిత్యం హల్‌చల్ చేస్తుండటంతో ఫ్యామిలీస్ అటు వెళ్లలేని పరిస్థితి నెలకొనిందంటారు. రోడ్డుపైనే తాగుతూ మద్యం మత్తులో చిందులేయడం, గొడవలు చేయడం అక్కడ షరామామూలుగా మారిపోయింది. ఇక కడపలోని ఆర్టీసీ బస్టాండు, రాజంపేట రోడ్డులోని వైఎస్ స్టాచ్యు వద్ద, పాతబస్టాండు, అప్సర, మున్సిపల్ స్టేడియం, మార్కెట్‌యార్డు, రింగురోడ్డులోని మాచుపల్లె క్రాస్.. అన్నిచోట్లా ఇదే పరిస్థితి. ఇక ప్రొద్దుటూరు, బద్వేలు, పులివెందుల, కమలాపురం షరామామూలే. దీని వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు రావడం గమనార్హం. ఇప్పటికైనా చంద్రబాబు ప్రభుత్వం బ్రాందీషాపుల్లో సిట్టింగ్ వ్యవహారంపై గట్టిగా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరించాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడుతో కలసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి పారదర్శకంగా విచారణ చేసి పరిష్కరించాలన్నారు. పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పొద్దని అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తూ వాటిని క్షుణ్ణంగా పరిశీలించి తదుపరి చర్యలకై సంబంధిత శాఖల అధికారులకు సిఫార్సు చేశారు.

ఈ సందర్భంగా పెండ్లిమర్రి మండలానికి చెందిన వెంకట నారాయణయాదవ్ అనే వృద్ధుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూ తన ఇద్దరు కొడుకులకు చెరి 10 ఎకరాల భూములు, ఇళ్లు ఇచ్చి పెళ్లిళ్లు చేశానని ఇప్పుడు తనను చూడటం లేదని అన్నారు. వీఎన్‌పల్లి మండలం ఊటుకూరి గ్రామ నివాసి వై.లక్ష్మీదేవి ఫిర్యాదు చేస్తూ జీఎన్ఎస్ఎస్ కుడి కాలువ నిర్మాణంలో తన భూమి కొంత భాగం పోయిందని దానికి నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, వెంకటపతి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, డీఆర్డీఏ పీడీ ఆనంద్‌నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీకి 178 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 178 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

హిందూధర్మాన్ని కాపాడుకుందాం

- హిందూ ఐక్యవేదిక ర్యాలీలో వక్తలు



చెన్నూరులో హిందూ ఐక్యవేదిక ర్యాలీ

చెన్నూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సనాతనమైన హిందూ ధర్మాన్ని అందరం కలిసికట్టుగా కాపాడుకోవాలని హిందూ ఐక్యవేదిక సభ్యులు తెలిపారు. లక్షల సంవత్సరాల నాటి సనాతన ధర్మాన్ని, వేలాది ఏళ్లక్రితం నిర్మించిన ఆలయాలను పరిరక్షించాలంటూ చెన్నూరులో సోమవారం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పొడవునా ప్రజలు జై శ్రీరాం జైజై శ్రీరాం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. స్థానిక పాతబస్టాండు కూడలిలో ఐక్యవేదిక అధ్యక్షుడు జీఎన్ భాస్కర్‌రెడ్డి, సభ్యులు శివరామిరెడ్డి, కల్లూరు విజయభాస్కర్‌రెడ్డి, గుమ్మళ్ల మల్లికార్జునరెడ్డి మాట్లాడారు. హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నా కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఎంతో ఘన చరిత్ర, సంస్కృతి ఉన్న ఆలయాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. హిందువులను అణగదొక్కాలని చూస్తే ఏ మతమైనా కాలగర్భంలో కనుమరుగుకాక తప్పదన్నారు. అనంతరం ఆలయాలను పరిరక్షించాలని, సనాతర ధర్మం కాపాడాలని తహశీల్దారు సరస్వతికి వినతిపత్రం అందించారు. అలాగే చెన్నూరు మండలంలో సైతం ఆలయాల విషయంలో ఇతరులు ఎవరైనా జోక్యం చేసుకున్నా, ఎలాంటి గొడవలకు పాల్పడ్డా కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. కాగా.. ర్యాలీ నిర్వహిస్తున్న సమయంలో ఓ ప్రార్థనా మందిరం వద్దకు రాగానే ఉద్రిక్తత నెలకొంది. జై శ్రీరాం అంటూ నినాదాలు చేయడంతో అక్కడ కాసేపు ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. పరిస్థితి అదుపు తప్పుతుందేమో అని సీఐ క్రిష్ణారెడ్డి కడప డీఎస్పీ వెంకటేశ్వర్లుకు సమాచారం ఇచ్చారు. వెంటనే డీఎస్పీ ఇక్కడకు చేరుకుని ర్యాలీ నిర్వహిస్తున్న వారితో మాట్లాడి ఘర్షణ జరగకుండా చూశారు. ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితుల దృష్ట్యా ర్యాలీ పొడవునా చెన్నూరు సీఐ క్రిష్ణారెడ్డి, కడప నుంచి వచ్చిన సీఐలు బాలక్రిష్ణ, నాగార్జున, వెంకటేశ్వర్లుతో పాటు పెద్దఎత్తున పోలీసులు, ప్రత్యేక పోలీసు దళం ముందుజాగ్రత్తగా మోహరించారు. కార్యక్రమంలో ఆకుల ప్రసాద్‌బాబు, కుంచెం రామక్రిష్ణా రెడ్డి, ఆకుల చలపతి, రామకోటిరెడ్డి, పాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక పంపిణీ సజావుగా జరగాలి

- డీఎల్ఎస్సీ సమావేశంలో కలెక్టర్

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇసుక పంపిణీ సజావుగా జరగాలని నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో ఇసుక బుకింగ్, సరఫరా, ఇసుక లభ్యత తదితర అంశాలపై ఎస్పీ అశోక్ కుమార్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలసి కలెక్టర్ జిల్లా స్థాయి సాండ్ కమిటీ (డీఎల్ఎస్సీ) సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ఇసుక సల భంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద ఎంత క్వాంటిటీ బుక్ చేసుకుంటున్నారు? ఎంత నిల్వ ఉంటుందని రోజువారి డేటాను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. నిర ్ణయించిన నిర్వహణ ఖర్చులు సప్లై పాయింట్ల వద్ద బ్యానర్‌పై కచ్చితంగా ప్రద ర్శించాలన్నారు. ఆపరేటింగ్ ఏజెన్సీ బ్యాం క్ ఖాతాలలోకి డిజిటల్ చెల్లింపులు విని యోగదారుల ద్వారా జరగాలన్నారు. జిల్లాలో 6 సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌ల నిర్వహణకు నోటిఫికేషన్ ఇవ్వాలని, అలాగే అదనంగా అందుబాటులో ఉన్న డిసిల్టేషన్ పాయింట్లను గుర్తించాలని అన్నారు. ప్రతి స్టాక్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలు నిరంతరం పని చేసేలా చూడాలన్నారు. జిల్లాలో జరుగుతున్న ఇసుక అక్రమ రవా ణాపై నిఘా పెంచి కఠిన చర్యలు తీసుకో వాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఓబు లమ్మ, గనులు భూగర్భ శాఖ డీడీ సూర్య చంద్రరావు, ఆర్డీవో, పోలీసు అధికారులు, గ్రౌండ్ వాటర్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ ఆర్జేడీగా శ్రీనివాసులు డీఐఈఓగా సత్యనారాయణరెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ కడప ఆర్జేడీగా శ్రీనివాసులు, డీఐఈఓగా సత్యనారాయణరెడ్డిలను నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోనశశిధర్ సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. నెల్లూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.శ్రీనివాసులుకు ఆర్జేడీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆర్జేడీగా కొనసాగుతున్న రవిని అన్నమయ్య జిల్లా డీఐఈఓగా బదిలీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న సీహెచ్ సత్యనారాయణరెడ్డిని కడప జిల్లా డీఐఈఓగా నియమించారు. ఇక్కడ ఇన్‌చార్జి డీఐఈఓగా విధులు నిర్వహిస్తున్న ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య కడప ఆర్ఐఓగా కొనసాగనున్నారు.

సుప్రీంకోర్టు తీర్పునకు కట్టుబడి ఉందాం

- ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టం అంశంలో సుప్రీంకోర్టు తీర్పునకు కట్టుబడి ఉండాలని ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి విచారణ వరకు యథాతథస్థితి కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకో ర్టుకు హామీ ఇచ్చిన నేపథ్యంలో ఈ చట్టాన్ని సమర్థిస్తున్న వారు, అదేవిధంగా ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న వారు సంయమనం పాటించా లని సూచించారు. విచారణ మే 5న జరగనున్న దృష్ట్యా స్టే ఇవ్వద్దంటూ కేంద్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనపై సుప్రీంకోర్టు అంగీకరించింది తప్ప.. ఓ నిర్ణయానికి రాలేదని తెలిపారు. ఎంతో సున్నితమైన ఈ అంశాన్ని ఎవరికి వారు తమ రాజకీయ ప్రయోజనాలకోసం ఉపయోగించు కోవడం మంచిది కాదని పేర్కొన్నారు.

> జగన్ హయాంలో వైసీపీ నేతలు చెలరేగిపోయారు. ప్రతి చోటా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి జేబులు నింపుకున్నారు. చంద్రబాబు హయాంలోనూ ఇప్పుడు అదే జరుగుతోందని జనం అంటున్నారు. నాడు జగన్ హయాంలో చక్రం తిప్పిన వారే.. ఇప్పుడూ అధికారం చెలాయిస్తున్నారు. దందాలు సాగిస్తున్నారు. కడప కార్పొరేషన్‌లో సిండికేట్‌గా మారి ఎగ్జిబిషన్ నిర్వహణను అత్యంత తక్కువకు దక్కించుకున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వంలోని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

చక్రం తిప్పారు..!

- కడప కార్పొరేషన్‌లో కాకలేపుతున్న ఎగ్జిబిషన్ టెండర్
- రూ.కోటి పోవాల్సిన దానిని రూ.30లక్షలకే కట్టబెట్టిన వైనం
- చంద్రబాబు పాలనలోనూ వైసీపీ ఫార్ములానే అమలు
- కార్పొరేషన్ ఆదాయానికి గండి
- కౌన్సిల్ సమావేశం లేకుండానే.. 30న ఓపెనింగ్ అంటూ ప్రచారం



ఎగ్జిబిషన్ అక్రమాలపై కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి (ఫైల్‌ఫొటో)



కడప మున్సిపల్ గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ నిర్వహణ కోసం జరుగుతున్న ఏర్పాట్లు

(కడప-ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్‌లో ఇటీవల నిర్వహించిన ఎగ్జిబిషన్ టెండర్లలో రూ.కోటి పలకాల్సిన దానిని మరీ గత ఏడాది కన్నా తక్కువకు కట్టబెట్టడం తీవ్ర దుమారం రేపుతోంది. ఇదంతా ఒక స్కెచ్ ప్రకారమే జరిగిందంటారు. ఈ టెండర్ల కుమ్మక్కులో కార్పొరేషన్ ఆదాయానికి అయితే గండిపడింది కానీ అదే సమయంలో నేతలకు జేబులు నిండడం గమనార్హం. ఈ సొమ్మంతా ఏమైనా అధికార పార్టీ జేబుల్లోకి వెళ్లిందా అంటే అదీ లేదు.. మొన్న జరిగిన ఎన్నికల్లో చంద్రబాబుతో పాటు కూటమి నేతలను ఓడించాలనే లక్ష్యంతో విషం చిమ్మి ప్రచారం చేసిన బ్యాచ్‌కే ఈ డబ్బంతా చేరింది. వారికే ఈ ప్రభుత్వంలో అగ్రతాంబూలం దక్కుతుండడం, పనుల్లో కూడా వారికే ప్రాధాన్యం ఉండటం హాట్‌టాపిక్‌గా మారింది. ఎగ్జిబిషన్ టెండర్ సైతం అదే బ్యాచ్ వెనకుండి దక్కించుకుందని చెబుతున్నారు. ఎగ్జిబిషన్ టెండర్ వ్యవహారంలో గోల్‌మాల్‌పై బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి కడప కమిషనర్‌కు వినతిపత్రం ఇవ్వడం గమనార్హం.

కొద్దికాలంగా కడప నగరం బాగా విస్తరిస్తోంది. కార్పొరేట్ సంస్థలన్నీ ఇక్కడ బ్రాంచ్‌లు ఓపెన్ చేస్తున్నాయి. జనం కూడా ఎంటర్‌టైన్‌మెంటుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఫుడ్‌కోర్టులు, ఎంటర్‌టైన్‌మెంటు ప్రాంతాలన్నీ జనంతో కిక్కిరిసిపోతున్నాయి. మరో మూడు రోజుల్లో విద్యాసంస్థలన్నింటికీ సెలవులు రానున్నాయి. జూన్ రెండో వారం వరకూ అంతా హాలిడేస్. ఇక అంతా ఎంటర్‌టైన్‌మెంటుకు కొదవ ఉండదు. టాలీవుడ్ సినిమాల రిలీజ్‌లన్నీ వేసవి సెలవులలో చేస్తుంటారు. ఈ నేపథ్యంలో కడప కార్పొరేషన్‌లోని మున్సిపల్ గ్రౌండ్‌లో 45 రోజుల పాటు నిర్వహించే ఎగ్జిబిషన్‌కు ఇటీవల టెండర్లు ఆహ్వానించారు.

సిండికేట్

కడపలోని మున్సిపల్ గ్రౌండులో నిర్వహించే ఎగ్జిబిషన్‌కు నిర్వహించిన టెండర్లలో ఆరుగురు పాల్గొన్నారు. పక్కా స్కెచ్ ప్రకారమే వీరంతా టెండర్లలో పాల్గొన్నారని అంటున్నారు. గత ఏడాది జగన్ ప్రభుత్వం అధికారంలో ఉంది. దీనికి తోడు అది ఎన్నికల సమయం. ఎగ్జిబిషన్‌కు టెండర్ నిర్వహిస్తే అప్పటి కమిషనర్ సాయిచంద్ ప్రవీణ్‌పై భారీ స్థాయిలో వత్తిడి వచ్చినా ఆయన లెక్కచేయలేదు. వైసీపీ ప్రభుత్వంలోనే రూ.35 లక్షలకు టెండరు ఖరారు చేశారు. ఈసారి ఎలాంటి వత్తిడి లేకుండా అధికారులు టెండర్లు నిర్వహించి ఉండింటే రూ.కోటి దాకా కార్పొరేషన్‌కు ఆదాయం సమకూరేది. అయితే ఎగ్జిబిషన్ కోసం వ్యూహాత్మకంగా మిగతా వారి టెండర్లను తప్పించి గత ఏడాది కన్నా తక్కువగా రూ.30.5లక్షలకు కట్టబెట్టడం గమనార్హం. ఎంత తక్కువ అనుకున్నా రూ.75లక్షల నుంచి రూ.కోటి వరకు పలికేది. అయితే సిండికేట్‌గా మారిన బ్యాచ్ రూ.30.5లక్షలకు టెండరు దక్కించుకుని మిగిలిన వారంతా భారీ స్థాయిలో డబ్బులు పంచుకున్నారని చెబుతున్నారు.



అందంగా కట్టి వదిలేశారు

- నిరుపయోగంగా సచివాలయాలు, ఆర్బీకే, హెల్త్ సెంటర్‌లు
- ప్రభుత్వ ధనం వృథా
- పట్టించుకోని పాలకులు

వివరాలు 7 లో..

ఇంటి బిల్లులకు మోక్షం ఎప్పుడో..

- ఎనిమిదేళ్లుగా ఎదురుచూపులు
- గండికోట నిర్వాసితుల ఆవేదన

అనుమతులు లేకుండానే..

ఇప్పటివరకు ఎగ్జిబిషన్ నిర్వహణకు స్టాండింగ్ కమిటీ అనుమతి తీసుకోలేదు. అయితే మున్సిపల్ స్టేడియంలో ఎగ్జిబిషన్ నిర్వాహకులు నిర్మాణ పనులు చేపట్టడంతో పాటు.. ఈ నెల 30న ప్రారంభం అంటూ ప్రచారం చేస్తుండడం గమనార్హం. ఇంటి అద్దె అయినా సరే రెండేళ్లకొకసారి 10శాతం పెంచుతుంటారు. మరి కార్పొరేషన్‌లో ఎగ్జిబిషన్‌కు మాత్రం గతంలో నిర్వహించిన టెండరు కన్నా తగ్గిస్తూ తగ్గిస్తూ రావడం గమనార్హం. ఎగ్జిబిషన్ టెండర్లలో సిండికేట్ అయ్యి భారీగా కార్పొరేషన్ ఆదాయానికి గండికొట్టడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి రెండు రోజుల క్రితం కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. గతంలో పనిచేసిన కమిషనర్ సాయిచంద్ ప్రవీణ్ ఎగ్జిబిషన్ టెండర్లలో నిర్వహించిన తీరును, కార్పొరేషన్ ఆదాయం కోసం ఆయన పట్టుబట్టిన వైనాన్ని ప్రస్తుత కమిషనర్ మనోజ్‌రెడ్డికి వివరించారు. టెండర్లు రద్దుచేసి మళ్లీ పిలవకపోతే కార్పొరేషన్ ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపడతామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వంలోని బీజేపీ నేతలే కమిషనర్‌కు వినతిపత్రం ఇవ్వడం కడప రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది.

ఉద్యాన రైతు విల..విల...

- దోస, కర్బూజ, టమోటా, వంగ ధరలు పతనం
- బయటి రాష్ట్రాల్లో తగ్గిన డిమాండ్
- కుప్పకూలిన ధరలు
- తీవ్ర నష్టాలతో అప్పుల్లో అన్నదాతలు


ములకలచెరువు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు...రెండు కాదు...ఏకంగా నాలుగు పంటల ధరలు పతనమయ్యాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక అన్నదాతలు కుమిలిపోతున్నారు. కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలకు ధరల రూపంలో వచ్చిన కష్టం రైతులను ముంచింది. పంటలు చేతికొచ్చే సమయంలో ధరలు పాతాళానికి చేరడంతో సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక విలవిలలాడుతున్నాడు. ధరలు లేక ఏం చేయలేక చేతికొచ్చిన పంటలను కోత విధించకుండా పొలాల్లోనే వదిలి వేయాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా ధరలు లేక పొలాల్లోనే వదిలేసిన దోస, టమోటాలు, కర్బూజ, వంకాయలు దర్శనమిస్తున్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, కురబలకోట, బి.కొత్తకోట, పెద్దమండ్యం, తంబళ్లపల్లె మండలాల్లో వేలాది ఎకరాల్లో టమోటా, దోస, కర్బూజ, వంగ పంటలు సాగు చేశారు. ఎకరా సాగుకు రూ.1.20 లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకు ఖర్చు చేశారు. ఈ క్రమంలో ప్రస్తుతం సాగైన పంటల్లో దిగుబడి వస్తోంది. దిగుబడి వచ్చే సమయంలో ధరలు పతనమయ్యాయి.

టమోటా రైతుకు కన్నీరే మిగిలింది...


సోంపల్లె సమీపంలో పొలంలోనే వదిలేసిన టమోటాలు

టమోటా ధరలు నాలుగున్నర నెలలుగా కుప్పకూలడంతో రైతులు అల్లాడిపోతున్నారు. నియోజకవర్గంలోని ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాల్లో రికార్డు స్థాయిలో టమోటా సాగవుతుంది. ఈ ప్రాంతంలో సుమారు 2 వేల ఎకరాలకు పైగా సాగైంది. నాలుగున్నర నెలల క్రితం ఆశాజనకంగా ఉన్న టమోటా ధరలు ఒక్కసారిగా కుప్పకూలి పాతాళానికి చేరాయి. అప్పటి నుంచి టమోటా రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ధరలు ఏమాత్రం పెరగకపోవడంతో టమోటా రైతులు కుమిలిపోతున్నారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక కాయలు కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు. నాలుగున్నర నెలలుగా 23 కేజీల బాక్సు కేవలం రూ.50 నుంచి రూ.200లోపే పలుకుతోంది. దీంతో టమోటా రైతులకు తీవ్ర నష్టం చేకూరింది.

దోస కాయలు అడిగేవారు కరువయ్యారు



ఏడు ఎకరాల్లో దోస పంట సాగు చేశా. దీనికి గానూ రూ.12 లక్షలు ఖర్చు వచ్చింది. ప్రస్తుతం పంట చేతికొచ్చే సమయంలో ధరలు పడిపోయాయి. తోట దగ్గరకు వచ్చి కేజీ రూ.4నుంచి రూ.5కు అడుగుతున్నారు. మొదటి కోతకు రూ.3 లక్షలు వచ్చింది. అంతే తరువాత దోస అడిగే వారు లేరు. దీంతో కాయలు తోటలోనే వదిలేశాను. పెట్టుబడి కూడా రాలేదు. దోస పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోయాను.

- వెంకటరమణారెడ్డి, దోస రైతు, వేపూరికోట

రూ.18 నుంచి రూ.5కు పడిపోయిన కర్బూజ


వేపూరికోట వద్ద కోయకుండా వదిలేసిన కర్బూజ కాయలు

కర్బూజ పంట కూడా రైతులకు కన్నీళ్లు మిగిల్చుతోంది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటను వైరస్...ప్రతికూల వాతావరణం కోలుకోలేని దెబ్బతీసింది. ఇప్పుడు ధరల రూపంలో మరో కష్టం వచ్చి పడింది. నెల రోజులకు ముందే భారీగా దిగుబడి వచ్చిన కర్బూజ రైతులకు వైరస్ రూపంలో కోలుకోలేని దెబ్బ తగిలింది. తంబళ్లపల్లె, పెద్దతిప్పసముద్రం మండలాల్లో ప్రస్తుతం దిగుబడి వస్తోంది. ఇక్కడి నుంచి కర్ణాటక, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. ప్రస్తుతం ఇక్కడి నుంచి ఎగుమతి అవుతున్న రాష్ట్రాల్లో పంట అధికంగా సాగు కావడం, దిగుబడి బాగా వస్తుండడంతో ఇక్కడ డిమాండ్ పడిపోయింది. దీంతో ధరలు పతనమయ్యాయి. నెల రోజులకు ముందు కేజీ రూ.18 పలికిన ధర ఇప్పుడు రూ.5కు చేరింది. దీంతో అడిగేవారు లేక రైతులు పొలాల్లోనే వదిలేస్తున్నారు.

టమోటా పంట ముంచింది



టమోటా పంట వరుసగా సాగు చేయడంతో నష్టాలే మిగిలాయి. ధర ఉంటుందేమోనన్న ఆశతో ప్రస్తుతం ఆరు ఎకరాల్లో టమోటా సాగు చేశా. దీనికి గాను రూ.10 లక్షలు ఖర్చు వచ్చింది. టమోటా ధరలు కుప్పకూలడంతో పెట్టుబడి వచ్చే పరిస్థితులు కనపడడం లేదు. గతంలో కూడా చేసి ధర లేకపోవడంతో నష్టపోయాను.

-మల్లికార్జునరెడ్డి, టమోటా రైతు, పర్తికోట

పాతాళానికి పడిపోయిన దోస ధరలు


వేపూరికోట సమీపంలో పొలంలోనే దోస కాయలు

దోస ధరలు పాతాళానికి చేరుకోవడంతో రైతన్నలకు కన్నీరే మిగులుతోంది. దోస సాగు చేసిన రైతులను ధరలు నట్టేట ముంచాయి. 15 రోజుల క్రితం వరకు కేజీ రూ.20 పలికిన దోస ధర పతనమై రూ.5కి చేరింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 300 ఎకరాలకుపైగా దోస పంట సాగు చేశారు. ఇక్కడ పండిన దోస ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లోని పలు నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడి నుంచి ఎగుమతి చేస్తున్న రాష్ట్రాల్లో ప్రస్తుతం దోస పంట అధికంగా సాగై దిగుబడి భారీగా వస్తుండడంతో ఇక్కడి దోస ధరలు కుప్పకూలాయి.

వంగ సాగు చేసి తీవ్రంగా నష్టపోయా



భూమిని కౌలుకు తీసుకుని నాలుగు ఎకరాల్లో వంగ పంట సాగు చేశా. దీనికి గానూ రూ.4.50 లక్షలకు పైగా ఖర్చు వచ్చింది. పంట దిగుబడి వచ్చే సమయంలో ధరలు పతనమయ్యాయి. కాయలు కోత విధిస్తే కూలీ ఖర్చు కూడా రావడం లేదు. చేసేది లేక కాయలు కోయకుండా పొలంలోనే వదిలేశా. దీంతో వదిలేసిన వంకాయలు కళ్లెదుటే ఎండిపోతుండడంతో మనసు కలచివేస్తోంది.

- బాలాజీ, వంగ రైతు, గురికివారిపల్లె

రూ.25 నుంచి 10కి పడిపోయిన వంగ ధర


పెద్దపాళ్యం సమీపంలో వదిలేసిన వంకాయలు

వంగ ధర కూడా పతనమైంది. నెల రోజుల క్రితం వరకు రూ.25 పలికిన కేజీ ధర క్రమంగా తగ్గుతూ రూ.10కి పడిపోయింది. నిన్నటి వరకు ఆశాజనకంగా ఉన్న వంగ ధరలు కుప్పకూలాయి. నియోజకవర్గంలోని ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాల్లో రైతులు సుమారు 500 ఎకరాలకుపైగా సాగు చేశారు.

వ్యాపారులు రైతుల పొలాల వద్ద కొనుగోలు చేసి చెన్నై మార్కెట్‌కు తరలించి విక్రయిస్తారు. తమిళనాడు రాష్ట్రంలో కూడా వంగ పంట అధికంగా సాగు కావడంతో ఇక్కడ ధరలు సగానికి పడిపోయాయి.

చిరుత మృతి కేసులో అక్రమంగా ఇరికించారు

- ప్రభుత్వ విప్‌కు బాధితుల ఫిర్యాదు


శాసనమండలి విప్ హరిప్రసాద్‌కు గోడు విన్నవించుకుంటున్న పొన్నేటిపాళెం వాసులు

మదనపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలో వేటగాళ్ల ఉచ్చులో చిరుత మృతి చెందితే అటవీ శాఖాధికారులు అమాయక రైతులపై అక్రమ కేసులు బనాయించారని బాధితుల కుటుంబీకులు శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయానికి రాయలసీమ కో-ఆర్డినేటర్ రాందాస్‌చౌదరి, జనసేన సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ వెంట పొన్నేటిపాళెం గ్రామస్థులు వెళ్లారు.

ఈ సందర్భంగా హరిప్రసాద్‌తో రాందాస్‌చౌదరి మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో చిరుత మృతి చెందితే అడవి పక్కన ఉన్న భూమికి చెందిన రైతులను చిరుత మృతి కేసులో అక్రమంగా ఇరికించారన్నారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా విచారణ పేరుతో పిలిపించి అరెస్టు చేసి రిమాండుకు పంపారన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి బాధితుల గోడు తీసుకెళ్లి అక్రమ అరెస్టులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. దీనిపై హరిప్రసాద్ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌తో ఫోన్‌లో మాట్లాడి బాధితుల విన్నపాలను వినిపించారు. బాధితులకు తగిన న్యాయం చేస్తామని పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చారని రాందాస్‌చౌదరి తెలిపారు. కార్యక్రమంలో పొన్నేటిపాళెం గ్రామస్థులు సుబ్బరామిరెడ్డి, శ్రావణి, సురేంద్రరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, సుమలత, చంద్రకళ, భార్గవి, శ్రీనివాసులు, హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రిజర్వాయర్ వద్ద ఇసుక ట్రాక్టర్ సీజ్

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


వాల్మీకిపురంలో పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

వాల్మీకిపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని భోగంపల్లె రిజర్వాయర్ ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా ఉపేక్షించేది లేదని రెవెన్యూ అధికారులు, పోలీసులు హెచ్చరిస్తూ చర్యలు చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన 'మా ఇష్టం తోలేస్తాం' అన్న కథనంపై అధికారులు స్పందించారు. సోమవారం ఉదయం మళ్లీ ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడులు చేసి ఓ ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. కాగా పోలీసుల సమాచారం తెలియడంతో ఆ ప్రాంతం నుంచి మరో రెండు ట్రాక్టర్లు ఉడాయించినట్లు సమాచారం. దీనిపై స్థానిక తహసీల్దార్ పామిలేటి మాట్లాడుతూ రిజర్వాయర్ ప్రాంతంలో ఇసుక తవ్వకాలు, రవాణాను ఇకపై ఉపేక్షించేది లేదని మైనింగ్ అధికారుల ఆధ్వర్యంలో కూడా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రిజర్వాయర్ ప్రాంతంలో గట్టి నిఘా పెట్టి ఇసుకాసురుల ఆటలు కట్టించాలని లేనిపక్షంలో పట్టణానికి తాగునీటి సమస్య తలెత్తుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్వీయూ కెమిస్ట్రీ బోర్డు చైర్మన్‌గా డాక్టర్ రేణుక



వాల్మీకిపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవెంకటేశ్వర విశ్వ విద్యాలయం కెమిస్ట్రీ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా వాల్మీకిపురం ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ మాల్యం రేణుకను నియమిస్తూ ఎస్వీయూ వైస్ చాన్సలర్ ఉత్తర్వులు జారీ చేశారు. 21 సంవత్సరాలుగా అధ్యాపకురాలిగా పనిచేస్తున్న డాక్టర్ రేణుక ఎస్వీయూ కెమిస్ట్రీ బోర్డు ఆఫ్ చైర్మన్‌గా నియమితులు కావడం పట్ల వాల్మీకిపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ జె.కృష్ణమూర్తి, సహచర అధ్యాపకులు, హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. 2004 ఏప్రిల్‌లో మదనపల్లె బీటీ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా విధులలో చేరిన ఆమె అనేక పరిశోధనలు చేయడంతో డాక్టరేట్ ఇచ్చారు. 2004 నుంచి 2021 ఆగస్టు వరకు మదనపల్లె బీటీ కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా విధులు నిర్వహించిన రేణుకను అనంతరం వాల్మీకిపురం ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ చేశారు.

భూమి విషయమై ఘర్షణ : ముగ్గురికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

సిద్దవటం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్.రాజంపేట గ్రామం బీసీ కాలనీలో ఆదివారం రాత్రి భూవివాదమై అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరిగి ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు, ఎస్ఐ మహ్మద్‌రఫీ కథనం మేరకు... తంగా క్రిష్ణయ్య, తంగా గోపాల్ అనే ఇరువురు అన్నదమ్ములకు పెద్దలు సంపాదించిన భూమి 6 ఎకరాలు ఉంది. ఆ భూమి వారిద్దరికీ భాగపరిష్కారాల నిమిత్తం ఆదివారం అన్న క్రిష్ణయ్య వద్దకు వెళ్లగా క్రిష్ణయ్య వారిపై కర్రతో దాడి చేయగా గోపాల్, విష్ణు, క్రిష్ణవేణి తలకు బలమైన గాయాలయ్యాయి. వారిని ప్రభుత్వ వైద్యశాలకు, అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి క్రిష్ణయ్య, యల్లమ్మ, పెంచలమ్మ, గంగాదేవి, కళావతి, సాయి, మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి : ఏఎస్పీ


సమస్యలను తెలుసుకుంటున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను నిర్ణిత సమయంలోగా పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లాల నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి అదనపు ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని అదనపు ఎస్పీ తెలిపారు.

ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థుల మధ్య ఘర్షణ


విద్యార్థులను చెదరగొడుతున్న సీఐ కుళాయప్ప, సిబ్బంది

రాజంపేట టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండల పరిధిలోని బోయనపల్లెలో ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మన్నూరు సీఐ కుళాయప్ప తన సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని విద్యార్థుల గుంపులను చెదరగొట్టారు. ఘర్షణకు కారకులైన ఐదుగురు విద్యార్థులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇరువురిపై కొడవలితో దాడి


దాడిలో గాయపడిన లక్ష్మిదేవి, రామక్రిష్ణ

రాయచోటిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మోటారుకు విద్యుత్ వైరు తగిలించే విషయంలో ఇరు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో రేవన ప్రభాకర్ అనే వ్యక్తి ఇరువురిపై కొడవలితో దాడి చేసి తీవ్రంగా గాయపరచాడు. రాయచోటి అర్బన్ పోలీసుల కథనం మేరకు... రాయచోటి మండలం మాధవరం వడ్డెపల్లిలో రేవన లక్ష్మీదేవి తన వ్యవసాయ పొలంలో మోటారుకు విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన రేవన ప్రభాకర్ అనే వ్యక్తి లక్ష్మీదేవికి సంబంధించిన వ్యవసాయ మోటారు విద్యుత్ కనెక్షన్‌కు అక్రమంగా వైరు తగిలించేందుకు ప్రయత్నించగా ఆమె అడ్డుకుంది. దీంతో ఆగ్రహించిన రేవన ప్రభాకర్ తన వద్ద ఉన్న కొడవలితో ఆమెపై దాడి చేశాడు. పక్కనే ఉన్న ఆమె మేనమామ రామక్రిష్ణ అడ్డుకోవడంతో అతనిపై కూడా దాడి చేసి గాయపరిచాడు. గాయపడ్డ వారిని రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ బీవీ చలపతి తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు


దుకాణంలో ప్లాస్టిక్ కవర్లను తనిఖీ చేస్తున్న కమిషనర్ పల్లవి

బి.కొత్తకోట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్, పాలిథిన్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని కమిషనర్ జీవీ పల్లవి తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రధాన రోడ్లలో ఆమె పర్యటించి పలు దుకాణాలను తనిఖీ చేశారు. దాదాపు అన్ని దుకాణాలు, హోటళ్లు, పండ్ల వ్యాపారులు, కిరాణా స్టోర్‌లలో డిస్పోజబుల్ గ్లాసులు, కప్పులు, కవర్లు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ప్లాస్టిక్ కవర్ల వాడకంపై నిషేధం అమలులో ఉందని వాటిని వాడటానికి వీలు లేదన్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల కలిగే నష్టాలపై ఎన్నోసార్లు అధికారులు అవగాహనా కార్యక్రమాలు, ప్రచారాలు చేశారన్నారు. ఇప్పటికైనా ప్లాస్టిక్ కవర్ల అమ్మకం, వినియోగం పూర్తిగా ఆపివేసి ప్రత్యామ్నాయ మార్గాలు పాటించాలని ఆమె ప్రజలను కోరారు. నిబంధనలు పాటించకుండా బేఖాతరు చేసిన వ్యాపారులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనర్ వెంట ఏవో రమాదేవి, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఖురాన్ పండితుడు మృతి



కలికిరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కలికిరికి చెందిన ఖురాన్ పండితుడు, ముస్లిం మత ప్రచారకుడు ఖారీ సుహేల్ సాహెబ్ (35) సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. చిత్తూరు జిల్లా పలమనేరులోని ఒక మదరసాలో ప్రధాన గురువుగా పనిచేస్తున్న సుహేల్ అక్కడ ప్రసంగాలు చేయడానికి వెళుతుండగా తమిళనాడుకు చెందిన బస్సు ఢీకొనడంతో తీవ్రగా గాయపడ్డాడు. పలమనేరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సుహేల్ స్వగ్రామం కలికిరి పంచాయతీలోని రాజువారిపల్లె. సుహేల్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సోమవారం రాత్రి పలమనేరు మదరసా ఆవరణలోనే సుహేల్ అంత్యక్రియలు నిర్వహించారు.

రైల్వేకోడూరులో యువకుడు...


మృతి చెందిన చరణ్

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ నవీన్ బాబు వివరాల మేరకు... చియ్యవరం పంచాయతీ నడింపల్లికి చెందిన చరణ్(28) బైకుపై వెళుతుండగా అదుపుతప్పి శాంతినగర్ వద్ద ఉన్న బ్రిడ్జిని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంలో తిరుపతిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ నవీన్ బాబు తెలిపారు. అతివేగం లేదా అజాగ్రత్త కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడ్డ జ్ఞానేంద్రప్రసాద్

వాల్మీకిపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తీవ్ర గాయాలపాలైన సంఘటన సోమవారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. కలికిరి పట్టణానికి చెందిన జ్ఞానేంద్రప్రసాద్ (27) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తూ వర్క్ ఫ్రం హోమ్‌లో భాగంగా సొంతూరైన కలికిరిలోనే ఉంటున్నారు. మదనపల్లెలోని బంధువుల ఇంటికి వెళ్లిన ఆయన సోమవారం తన ద్విచక్రవాహనంలో కలికిరికి వెళుతుండగా మండలంలోని చెరకువారిపల్లె వద్ద బొలెరో లగేజీ వాహనం అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జ్ఞానేంద్రప్రసాద్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి వాహనం కోసం గాలింపు చేపట్టారు.

దారి దోపిడీ కేసులో దొంగ అరెస్ట్


దొంగ అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పెనగలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పెనగలూరు మండలం చక్రంపేట వద్ద 2023 మార్చి 8వ తేదీ అర్ధరాత్రి జరిగిన దారి దోపిడీ కేసులో నిందితుడిగా ఉన్న కందుల బాలవర్ధన్‌నాయుడిని సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పెట్టినట్లు ఎస్ఐ బి.రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. పెనగలూరు దళితవాడకు చెందిన మీసాల నవీన్‌కుమార్ ఇంటికి వస్తుండగా సాయివికాస్ పాఠశాల సమీపంలో స్పీడు బ్రేకరు వద్ద వేచి ఉన్న టి.పెంచలయ్య అలియాస్ చిన్న, కె.బాలవర్ధన్‌నాయుడు అలియాస్ బాలు కలిసి నవీన్ కుమార్‌కు కత్తితో బెదిరించి రూ.5 వేలు దోపిడీ చేశారు. బాలవర్ధన్ పరారీలో ఉండి 10 రోజుల కిందట సొంతూరు చక్రంపేటకు రాగా అతడి కోసం గాలిస్తున్న పెనగలూరు పోలీసులు ముద్రపల్లె క్రాస్‌రోడ్డు వద్ద అరెస్ట్ చేశారు. హెడ్‌కానిస్టేబుల్ ఖాదర్‌వల్లి, కానిస్టేబుళ్లు రవిశంకర్, హరిబాబు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న సిద్దవటం పోలీసులు


ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలు

సిద్దవటం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం పెన్నానది వంతెన సమీపంలో ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చిన ఓ వృద్ధురాలిని సోమవారం పోలీసులు కాపాడి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహ్మద్ రఫీ మాట్లాడుతూ లోలెవల్ వంతెన సమీపంలో ఓ వృద్ధురాలు పెన్నానదిలో ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చినట్లు గ్రామస్థులు సమాచారం తెలపడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని కాపాడి పరమాత్మసేవా ఆశ్రమంలో ఉంచామన్నారు. ఎవరైనా ఆమెను గుర్తిస్తే 9121100581, 9121100584 నెంబర్లకు ఫోన్ చేయాలని ఆయన పేర్కొన్నారు.

వక్ఫ్ ఆస్తులను లీజుకిచ్చే ప్రతిపాదనలు తగవు

● కాంగ్రెస్ పార్టీ మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

కడప మారుతీనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లు చట్టం కాకముందే కేంద్ర ప్రభుత్వం లీజు పేరుతో కార్పొరేట్లకు దాదాపు 99 సంవత్సరాలకు లీజు కిచ్చే ప్రతిపాదనలు చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ మాజీ రాజ్యసభ సభ్యుడు ఎన్.తులసిరెడ్డి అన్నారు. అణగారిన వర్గాల రక్షణ, రాజ్యాంగ హక్కులను కాలరాయడమే ధ్యేయంగా కేంద్రంలోని మోడీసర్కార్ పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అధ్యక్షతన సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం, రాజ్యాంగ బద్ధత సవాళ్లు అనే అంశంపై సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తులసిరెడ్డి హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి నేటి వరకు ముస్లిం ప్రజల ప్రజల మనోభావాలు దెబ్బ తీసేలా పాలన సాగిస్తోందన్నారు. ఆ కోవలో గత 2014 సంవత్సరం నుండే అటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో పాటు వివిధ రాష్ట్రాలలో అధికారంలో వున్న బీజేపీ ప్రభుత్వాల రాష్ట్ర ముఖ్యమంత్రులు వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు చట్టం కాకముందే వేలాది ఆస్తులు స్వాధీనం చేసుకుంటామని బెదిరింపుల పర్వానికి శ్రీకారం చుట్టడం సరి కాదన్నారు. సుమారు 1000 సంవత్సరాల క్రితం దేశాన్ని పాలించిన నవాబులు దాతృత్వంతో ఇచ్చిన ఆస్తులకు దస్తావేజులు లేవన్నారు. అలాంటి వాటిని బై యూజర్ పేరిట స్వాధీనం చేసుకునేందుకు పాల్పడటం విడ్డూరంగా ఉందన్నారు. బిల్లు చట్టం కాకముందే 52 బడా కార్పొరేట్ పెట్టుబడిదారులకు 99 సంవత్సరాలకు లీజు పేరుతో ప్రధాన నగరాలలోని విలువైన స్థలాలు, భవంతులు ఇవ్వడానికి ముందస్తుగా ప్రతిపాదనలు తయారు చేసుకోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ సుభాన్, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, డబ్ల్యు రాము, ఓబయ్య, సగిలి గుర్రప్ప, బాబు భాయ్, డాక్టర్ గోపాల్, దేవర శ్రీక్రిష్ణ, పలువురు ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అందంగా కట్టి వదిలేశారు...

● నిరుపయోగంగా సచివాలయాలు, ఆర్బీకే, హెల్త్ సెంటర్‌లు

● ప్రభుత్వ ధనం వృథా ● పట్టించుకోని పాలకులు



ప్రారంభానికి నోచుకోని ముద్దనూరు సచివాలయం, ఆర్బీకే భవనం



శెట్టివారిపల్లెలో ప్రారంభం కాని సచివాలయం



అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన శెట్టివారిపల్లె ఆర్బీకే భవనం

ముద్దనూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ఆర్భాటంగా సచివాలయాలు, ఆర్బీకే, హెల్త్‌సెంటర్ల నూతన భవనాలకు శ్రీకారం చుట్టారు. నిర్మాణాలూ మొదలు పెట్టారు. చాలా వరకు పూర్తయ్యాయి. అయితే చాలా చోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో అసంపూర్తిగా, నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగానూ మారుతున్నాయి. వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరు మండలంలో 19 గ్రామ పంచాయతీలను 12 సచివాలయ కేంద్రాలుగా ఏర్పాటుచేశారు. అన్ని చోట్లా సచివాలయాలు, ఆర్బీకే, హెల్త్ సెంటర్ నూతన భవనాల నిర్మాణం చేపట్టారు. వైసీపీ నాయకులకే సచివాలయాలు, ఆర్బీకే, హెల్త్ సెంటర్ నూతన భవనాల నిర్మాణ పనులు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలోనే భవన నిర్మాణం పనులు పూర్తయ్యాయి.

బిల్లులు చెల్లించకపోవడంతో అరకొర పనులు పెండింగ్‌లో పెట్టారన్న విమర్శలు వస్తున్నాయి. కొన్ని సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్ నూతన భవనాలు ప్రారంభించారు. ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా ఉన్న కొన్నింటిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. యామవరంలో ఆర్బీకే, ముద్దనూరు 1, 2 సచివాలయం, ఆర్బీకే, శెట్టివారిపల్లెలో సచివాలయం, ఆర్బీకే, తిమ్మాపురం సచివాలయం, ఆర్బీకే, కొలవలి, సచివాలయం, పెనికెలపాడు సచివాలయం, ఆర్బీకే భవనాలకు సంబంధించి అరకొర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపు మూడు సంవత్సరాలుగా ఇవి నిరుపయోగంగా ఉన్నాయి. కేవలం వైసీపీ ప్రభుత్వంలో నిధులు చెల్లించక పోవడంతోనే పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల ఇదే పరిస్థితి ఉందని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వంలో నైనా అవి శిథిలావస్థకు చేరుకోక ముందే ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై పీఆర్ ఏఈ మునికుమార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. మండలంలో కొన్ని సచివాలయాలు, ఆర్బీకే నూతన భవనాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసి అప్పగిస్తే బిల్లులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.

ఉత్సాహంగా సాగిన బండలాగుడు పోటీలు



బండలాగుతున్న వృషభరాజములు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ఒంగోలుజాతి వృషభరాజముల బండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. సోమవారం 11వ రోజు స్వామివారికి, అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం అశ్వ వాహనంపై స్వామివారిని ఆశీలను చేసి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన బండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో నంద్యాల జిల్లా పీఆర్‌పల్లెకు చెందిన బంటుపల్లి గోపాల్‌యాదవ్‌కు చెందని ఎడ్లు మొదటి స్థానంలో నిలిచి రూ.100116 అందుకున్నారు. అనంతపురం జిల్లా మేడిమాకుపల్లెకు చెందిన తోట తిరుపాల్‌రెడ్డి వృషభాలు ద్వితీయస్థానంలో నిలిచి రూ.75,116, రామేశ్వరానికి చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎడ్లు తృతీయస్థానంలో నిలిచి రూ.50,116 గెలుపొంది నగదు బహుమతులు అందుకున్నారు. బండలాగుడు పోటీలు సందర్భంగా రామేశ్వరం పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మార్తల రాజారెడ్డి, ఈవో శ్రీధర్, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మైదుకూరులో రసవత్తరంగా...



మొదటి బహుమతి సాధించిన ఎడ్ల యజమానులకు నగదు అందజేస్తున్న కశెట్టి కిరణ్‌కుమార్

మైదుకూరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మైదుకూరులో అంకాలమ్మతల్లి తిరుణాల సందర్భంగా సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో నంద్యాలకు చెందిన బోరెడ్డి వీరనరసింహారెడ్డి, సుంకి సురేంద్రరెడ్డిల ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ.1,50,000లను అందుకున్నారు. మైదుకూరుకు చెందిన కుర్రా వెంకటేశ్ యాదవ్ ఎద్దులు రెండవ స్థానంలో నిలిచి రూ.1,00,000, సిరివెళ్ల మండలం గుంద్రమాన్‌దిన్నెకు చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డికి చెందిన ఎద్దులు మూడో స్థానంలో నిలిచి రూ.75వేలు, నంద్యాల జిల్లా పెసరవాయికు చెందిన సయ్యద్ కలాంబాషా ఎద్దులు నాలుగో స్థానంలో నిలిచి రూ.50వేలు, ఖాజీపేట మండలం పత్తూరుకు చెందిన కవ్వా బాలయ్య, బోలా వెంకటయ్యలకు చెందిన ఎడ్లు ఐదో స్థానంలో నిలిచి రూ.30వేలు బహుమతి సాధించాయి. కార్యక్రమంలో లక్ష్మీ బిల్డర్స్ అధినేత కశెట్టి కిరణ్‌కుమార్, కశెట్టి నర సింహులు, కశెట్టి రవికుమార్, కొమ్మూరి సురేష్‌బాబు, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

బంగారు నగల చోరీ కేసులో ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ఓ ఇంటిలో జరిగిన బంగారు నగల చోరీ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు తెలియజేశారు. జమ్మలమడుగు పట్టణంలోని ఎస్సీ కాలనీలో మార్చి 24వ తేదీ కరపాకుల సుజాత భర్త చంద్రశేఖర్ అనే వ్యక్తి ఇంటిలో పూజల పేరుతో పది తులాల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి సీసీ పుటేజీ ద్వారా నిందితుల సమాచారం తెలుసుకున్నారన్నారు.

కర్నూలు జిల్లా సిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామానికి చెందిన కనకమ్మ, ముదిర్నే శ్రీనివాసులు ప్రస్తుతం ప్రొద్దుటూరు మండలం చౌడూరు గ్రామంలో ఉండేవారు. వీరు సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో ఒంటరిగా ఉన్న మహిళల వద్దకు వెళ్లి వారి ఇళ్లలో, అనారోగ్య సమస్యలను పూజలు చేసి నయం చేస్తామని మాయమాటలు చెప్పేవారు. పూజలు చేసే సమయంలో బంగారు లేక వెండి వస్తువులు ఉంచితే మంచి ఫలితం వస్తుందని మోసపూరిత మాటలు చెప్పి ఆభరణాలు చోరీ చేసేవారు. వీరిపై నిఘా పెట్టి అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసును ఛేదించిన సీఐ, ఎస్ఐలతో పాటు పోలీసులు హైమావతి, దేవదాసు, రియాజ్, నాగేంద్రలను డీఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొరిచెరువు వద్ద రవికుమార్ (45) అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళుతూ చెట్టుకు ఢీకొని మృతి చెందినట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. రవికుమార్ గాలివీడు మండలం నూలివీడు పంచాయతీ శ్రీనివాసపురం వాసి. మంచాలకు వైర్లు అల్లుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం లక్కిరెడ్డిపల్లె ప్రాంతాల్లో మంచాలకు వైర్లు అల్లుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా గాలివాన బీభత్సానికి ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొని మృతి చెందాడు. ఈ విషయాన్ని పశువుల కాపరులు గుర్తించి తమకు సమాచారం అందించారని ఎస్ఐ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని తెలిపారు.

చిలమకూరు అల్ట్రాటెక్ మైన్స్ టిప్పర్లు సీజ్



సీజ్ చేసిన టిప్పర్లను జడ్పీ హైస్కూల్ మైదానంలో ఉంచిన దృశ్యం

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చిలమకూరులోని అల్ట్రాటెక్ మైన్స్ నుంచి ఫ్యాక్టరీలోకి సున్నపురాయిని రవాణా చేస్తున్న 5 టిప్పర్లను ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు సోమవారం సీజ్ చేశారు. నిబంధనలకు మించి ఓవర్‌లోడ్‌తో వెళుతున్న దృష్ట్యా టిప్పర్లను సీజ్ చేసి.. రవాణాశాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. కాగా, ఇటీవల అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి మధ్య వివాదం నడుస్తుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో టిప్పర్లను సీజ్ చేయడంతో స్థానికంగా చర్చ జరుగుతోంది. ఇటీవల జరిగిన పరిణామాలతో ప్లాంటు వద్ద పోలీసు బందోబస్తు కొనసాగుతోంది.

17 మందిపై కేసు నమోదు

వేంపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపల్లె గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరసింహులు తెలిపారు. భార్య భర్తల పంచాయతీ విషయంపై ఈ ఘర్షణ చోటు చేసుకోగా ఇరువర్గాలకు చెందిన మున్వర్, బాదుల్లా, నందిపల్లె వైసీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డితో పాటు 17 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో కడప విద్యార్థినుల ప్రతిభ



ట్రోఫీలు అందుకుంటున్న తేజోమయి, లక్ష్మీమనుశ్రీ

కడప స్పోర్ట్స్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు పట్టణ సిల్వర్ ఓక్స్ స్కూల్‌లో ఈనెల 20న జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో కడప నగరానికి చెందిన తేజోమయి, లక్ష్మీ మనుశ్రీ ప్రతిభ కనబరచినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారి వెల్లడించారు. అండర్-15, అండర్-11 బాలికల విభాగంలో తేజోమయి, లక్ష్మీ మనుశ్రీ 5వ స్థానం సాధించి ట్రోఫీలు అందుకున్నారని.. ఈ టోర్నమెంట్‌లో 266 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు.

సీసీ రోడ్ల నాణ్యతపై విజిలెన్స్ తనిఖీలు

లింగాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పాడా నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్ల నాణ్యతను సోమవారం విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. మండలంలోని దొండ్లవాగు గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన మూడు సిమెంటు రోడ్లను, పెద్దకుడాలలో ఒక సిమెంటురోడ్డు నాణ్యతను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. వారి వెంట పంచాయతీ రాజ్ అధికారులు ఉన్నారు.

భార్యాభర్తల మధ్య ఘర్షణ..ముగ్గురిపై కేసు

పులివెందుల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లెకు చెందిన దుర్గారావు దంపతుల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ చాంద్‌బాష తెలిపారు. దుర్గారావు అతని భార్య మధ్య మనస్పర్థలతో గొడవలు జరిగేవి. దీంతో దుర్గారావుపై అతని అత్త వరలక్ష్మి, మామ లక్ష్మణ్, బామర్ది దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇంటి బిల్లులకు మోక్షం ఎప్పుడో...

● ఎనిమిదేళ్లుగా ఎదురుచూపులు

● గండికోట నిర్వాసితుల ఆవేదన



కొండాపురం రామచంద్రనగర్ పునరావాస కాలనీలో పునరావాసం కింద నిర్మించుకున్న ఇళ్లు

కొండాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పునరావాసం కింద అందాల్సిన ఇంటి బిల్లులు గత ఎనిమిదేళ్లుగా రాకపోవడంతో గండికోట నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. వీరిని పునరావాస పరిహారం కింద రెండు కేటగిరిలుగా విభజించారు. ఒకటి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద పూర్తిగా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లిస్తారు. రెండోది ఇంటిస్థలం కావాలనుకుంటే రూ.3లక్షలు పట్టుకొని రూ.7లక్షలు చెల్లిస్తారు. ఇందులో రూ. 3 లక్షల్లో రూ.1,14,000 గాను ఐదు సెంట్ల ఇంటిస్థలం, పునరావాస కాలనీ డెవలప్‌మెంట్‌కు అంటే.. రోడ్లు, డ్రైనేజీలు, శ్మశానవాటికలు తదిర వాటికి పట్టుకుంటారు. మిగిలిన రూ.1,86,000 నిర్వాసితుడు ఇళ్లు కట్టుకునేటప్పుడు తిరిగి చెల్లిస్తారు. ఎనిమిదేళ్ల కిందట మొదటిసారి పునరావాస పరిహారం చెల్లించినప్పుడు కొంతమంది నిర్వాసితులకు ఇంటి బిల్లులు చెల్లించారు. ఆ తర్వాత దీని గురించి ఊసే లేకపోవడంతో బిల్లులు అందని వారు ఆందోళన చెందుతున్నారు.

అయోమయంలో గండికోట నిర్వాసితులు

తమకు ఇచ్చే రూ.10లక్షల పరిహారంలో ఇంటి నిర్మాణానికి తిరిగి రూ.1,86,000 చెల్లి స్తామని గతంలో అధికారులు చెప్పి ఒప్పించారు. దీని ప్రకారం 2017వ సంవత్సరం వరకు కొంతమందికి ఇంటి నిర్మా ణానికి బిల్లులు పడ్డాయి. ఆ తర్వాత బిల్లులు రాకపో వడంతో ఇళ్లు నిర్మించుకున్న నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. అధికారు లను అడిగితే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని.. అదే విధంగా రూ.7 లక్షల పరిహారం తీసుకున్నవారికి ప్రభుత్వం కొత్తగా పక్కాగృహాలు కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు.

వెంటనే బిల్లులు చెల్లించాలి



గత టీడీపీ ప్రభుత్వంలో కొంత మందికి ఇంటి బిల్లులు వచ్చాయి. ఎనిమిదేళ్ల నుంచి పునరావాసం కింద ఇంటి బిల్లులు రాలేదు. అధికారులను అడిగితే పొంతనలేని సమాధానలు చెబుతున్నారు. కొంత మంది అప్పు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని వెంటనే రూ.1,86,000 ఇంటి బిల్లు చెల్లించాలి.

-ఎం.మనోహర్‌బాబు,
సీపీఐ మండల కార్యదర్శి, కొండాపురం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

పునరావాసం కింద నిర్మించుకున్న ఇళ్లకు సంబంధించి ఉన్నతాధికా రుల దృష్టికి తీసుకెళ్లాం. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కూడా ఉన్న తాధికారులతో మాట్లాడారు. ఈ బిల్లులకు సంబంధించి ప్రభుత్వం నుంచి నిర్ణయం రావాల్సి ఉంది.

-గురురాజ, హౌసింగ్ ఏఈ, కొండాపురం

వెంటనే కూటమి ప్రభుత్వం చొరవ తీసుకొని తమకు రావలసిన ఇంటి బిల్లు రూ.1,86,000 చెల్లించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

24న మండల సర్వసభ్య సమావేశం

సింహాద్రిపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 24వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిదులు, అన్ని శాఖల మండల అధికారులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు. సమావేశానికి వచ్చే అధికారులు వారి శాఖలలోని సమగ్ర సమాచారంతో రావలెనని ఎంపీడీఓ తెలిపారు.

'సీఈఓపై చర్యలు తీసుకోవాలి'

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పులివెందుల వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఆప్కాస్ కింద పనిచేస్తున్న 25 మంది కార్మికులను తొలగించిన సీఈఓపై చర్యలు తీసుకోవాలని ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. కార్మికుల తొలగింపునకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యం లో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.కార్యక్రమంలో సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు రామ్మోహన్, గోపి, మహేష్, పవన్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూ సమస్యలు పరిష్కరించాలి..: కడప మండల పాత కడప దళితుల భూ సమస్య వెంటనే పరిష్కరించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కడప ఆర్డీఓ కార్యాలయం వద్ద దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దళిత రైతు బాధితులు వెంకటేష్, నిత్యపూజయ్య, శేఖర్, ఓబులేసు, వెంకట సుబ్బయ్య ఆర్‌సీపీ, దళిత గిరిజన కుల పోరాట సంఘం నాయకులు పాల్గొన్నారు.

హమాలీల అరియర్స్ ఇవ్వాలి..: జిల్లాలోని సివిల్ సప్లయిస్ హమాలీలకు పెంచిన కూలి ధరలు, రావాల్సిన అరియర్స్ డబ్బులు తక్షణం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్ స్పందనంలో జేసీ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలగురవయ్య, మురారి,ఉపాధ్యక్షులు శ్రీరాములు పాల్గొన్నారు.

బోగస్ పట్టాలు రద్దు చేయాలి..: కడప నగరం 15వ డివిన్ సరోజిని నగర్ దగ్గర ఉన్న ఆచార్య కాలనీలో బోగస్ పట్టాలు సృష్టిస్తున్న దళారుల పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ కోరారు. సోమవారం కడప కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌ను సీపీఎం కడప నగర కమిటీ బృందం కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, గోవిందు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆరో తరగతి ప్రవేశపరీక్ష

వల్లూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గంగాయపల్లెలో ఉన్న ఆదర్శ పాఠశాలలో సోమవారం 6వతరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ సురేశ్‌కుమార్ తెలిపారు. మొత్తం 229 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 214 మంది రాశార ఆయన తెలిపారు. ఎస్ఐ పెద్ద ఓబన్న బందోబస్తు నిర్వహించారు.

'వసతులు కల్పించండి'

చెన్నూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : హైవే రహదారిలో ప్రమాదాలు జరుగుతున్నా ఇంకా పూర్తిగా వసతులు కల్పించక పోవడమేనని చెన్నూరు మండల మహిళా నేతలు జి.అరుణ కుమారి, బీజేపీ మహిళా అధ్యక్షురాలు సరోజనమ్మ సోమవారం న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శికి వినతిపత్రం అందించారు.

నిరుద్యోగులకు చంద్రబాబు వరం మెగా డీఎస్సీ




చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం, మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ప్రమాణస్వీకారం రోజు డీఎస్సీ ప్రకటనపై తొలి సంతకం చేసి పది నెలల్లో అమల్లోకి తెచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌లు అభినందనీయులను ముమ్మాటికి ఈ ప్రకటన నిరుద్యోగుల పాలిట వరంలాంటిదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరి ప్రసాద్ అభిప్రాయపడ్డారు. సోమవారం కడప నగరం హరిటవర్స్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంధం ప్రసాద్ పాల్గొన్నారు.

టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..: నగరలోని మాసాపేటలో సోమవారం మెగా డీఎస్సీ ప్రకటించడంతో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, జిల్లా ఉపాధ్యక్షులు ఏటూరు లోకేష్, రెడ్డి భార్గవ్, మీడియా కోఆర్డినేటర్ విశ్వనాథ్, నగర అధ్యక్షుడు అనిల్, నగర కార్యదర్శి వినయ్, నగర ప్రధాన కార్యదర్శి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కడప సెవెన్ రోడ్స్..: డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ నిరుద్యోగ జేఏసీ, ఆర్ఎస్ఎఫ్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు సోమవారం కోటిరెడ్డి సర్కిల్లో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్దిక్, ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసుయాదవ్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ పాల్గొన్నారు.

కడప మారుతీనగర్..: పోరాటాలు, కేసులు, లాఠీచార్జీలు, అక్రమ అరెస్టులు బెదిరింపులకు అదరక నిరుద్యోగుల పక్షాన నిలబడి పోరు సాగించిన నేపథ్యంలో నేటి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వెలువ డిందని రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్వీఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

వీధి దీపాలు వేయండి

పులివెందుల టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల పట్టణంలో శ్రీనివాస ధియేటరు నుండి గాంధి సర్కిల్ వరకు, గాంధి సర్కిల్ నుంచి కొత్త ఆర్టీసీ బస్టాండు వరకు, పార్నపల్లి రోడ్డు సరిల్ నుంచి నల్లపురెడ్డిపల్లె వైఎస్ఆర్ సర్కిల్ వరకు, నల్లపురెడ్డిపల్లె వైఎస్ఆర్ సర్కిల్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు వీధిలైట్లు రాత్రిపూట వెలగకపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులువేలూరు శ్రీనివాసరెడ్డి మున్సిపల్ అధికారులపై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పార్నపల్లి రింగు రోడ్డు నుంచి రంగనాధ స్వామి దేవాలయం నల్లపురెడ్డిపల్లె రింగు రోడ్డు వరకు తెల్లవారుజామున మహిళలు, వృద్ధులు వాకింగ్ చేస్తుంటారు. ఆ సమయంలో ఏదైనా ప్రమాదాలు కానీ, దొంగతనాలు కానీ జరిగితే ఎవరు బాధ్యులని ఆయన అన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి



అగ్నిప్రమాదాలపై డెమో నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలను నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారి బి.బస్విరెడ్డి తెలిపారు. సోమవారం జాతీయ అగ్నిమాపక సేవా వారోత్సవాలలో భాగంగా జిల్లా అగ్నిమాపక శాఖ, వైవీయు ఎన్ఎస్ఎస్ యూనిట్-4 ఆధ్వర్యంలో యోగివేమన విశ్వవిద్యాలయ విద్యార్థినిల వసతి గృహంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, చీఫ్ వార్డన్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, వసతిగృహాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేయాలి

సింహాద్రిపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేయడానికి అందరూ సహకరించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా డీపీఎం ప్రవీణ్‌కుమార్ కోరారు. సింహాద్రిపురం మండల వెలుగు కార్యాలయంలో రైతు సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేసేందుకు అన్ని శాఖల అధికారులతో సమన్వయ భాగస్వామ్య సమావేశం సోమవారం నిర్వహించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో ఉత్తమ రైతులుగా ఎంపిక చేసిన వెంకటనాయుడు, సాంబశివారెడ్డి, అరవిందనాథరెడ్డిని అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం వసంతకుమారి, ఏఓ శివమోహన్‌రెడ్డి, ఏపీఎం మంజునాథ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భావితరాలకు సేంద్రియ ఆహారాన్ని అందివ్వాలి

లింగాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు రసాయనిక ఎరువులు, పురుగుమందులు లేని సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన ఆహారాన్ని అందివ్వాలని టీడీపీ మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి అన్నారు. లింగాల స్త్రీశక్తి భవనంలో సోమవారం ప్రకృతి వ్యవసాయం 2025-26ఖరీఫ్ ప్రణాళిక సమావేశం జరిగింది. ఏవో రమేష్, ఏపీఎం రామాంజనేయులు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

కడప కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నగర మృత్యుంజయకుంటలో వెలసిన మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. లెక్కింపు కార్యక్రమానికి దేవదాయ, ధర్మాదాయ శాఖ జిల్లా కార్యాలయం నుంచి సంబంధిత సూపరింటెండెంట్ జి. రమణమ్మ, ఆలయ ఈవో ఎ. శ్రీధర్, ఆలయ ప్రధాన అర్చకులు ఎన్. సతీష్ శశిధర్‌శర్మ, దక్షిణామూర్తి హాజరైయ్యారు. ఫిబ్రవరి 17వ తేదీ నుంచి ఈనెల 21వరకూ దాదాపు రెండు నెలలకు గాను స్వామి వారి దర్శనానికి ఆలయానికి వచ్చే భక్తుల ద్వారా ఆలయంలో ఉన్న హుండీలో కానుకల రూపంలో సమర్పించిన ఆదాయంగా రూ.61,431 రాబడిగా వచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

'అగ్రవర్ణాలవారిపై చర్యలుతీసుకోండి'

కడప మారుతీనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వీరపునాయుని పల్లె మండల అనిమెల గ్రామానికి చెందిన దళితుల భూములను ఆక్రమించిన అగ్రవర్ణాల వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కె. మునెయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అనిమెల గ్రామానికి చెందిన బాధిత దళితులు పాల్గొన్నారు.

కడపలో హౌస్ సైట్ వెరిఫికేషన్

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కడప మండల పరిధిలో సోమవారం హౌస్ సైట్ పరిశీలన కార్యక్రమం జరిగింది. కడప మండల పరిధిలోని 13 లే- అవుట్లలో 19931 మందికి ప్లాట్స్ మంజూరు చేశారు. అందులో అర్హులను, ప్లాట్ల ఖాళీల వివరాలను గుర్తించే ప్రక్రియలో భాగంగా కడప ఇన్‌చార్జి తహసీల్దారు శివారెడ్డి ఆధ్వర్యంలో, గ్రామ రెవెన్యూ అధికారులు, మండల రెవెన్యూ అధికారులతో కలిసి ఎస్‌టీపీ లే అవుట్, టిడ్కో-1, టిడ్కో-2 గృహ సముదాయాలను పరిశీలిన చేశారు. మిగిలిన లే అవుట్లను వారంలోగా వెరిఫికేషన్ చేసి అర్హుల జాబితాతో పాటు ఖాళీ ప్లాట్ల వివరాలను సిద్ధం చేయనున్నారు.

ఎంఈఓకు ఘన సన్మానం

చక్రాయపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేట ఎంఈవో జాఫర్‌సాదక్ పదవీవిరమణ సందర్భంగా సోమవారం స్థానిక ఎమ్మార్సీలో మండలంలోని హెచ్‌ఎం లు, ఉపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపాళ్లు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈయన వీఎన్‌పల్లెలో రెగ్యులర్ ఎంఈఓగా పనిచేస్తూ రెండు సంవత్సరాల క్రితం చక్రాయపేట ఎంఈఓ-1గా పనిచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 రవికుమార్, మాజీ ఎంఈఓ ఇ.రామచంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయులు సంజీవకుమార్, పీవీ రమణ, రామాంజులు, కస్తూరిబా ప్రిన్సిపాల్ గౌస్‌ప్యారీ, గండి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సురేంద్రబాబు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రహమత్‌ఖాన్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కడప నాగరాజుపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రిమ్స్ ఆసుపత్రిలో రోగులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా అదనంగా మరో 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసినట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ హరిసేవ్యానాయక్ తెలిపారు. సోమవారం ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆయన పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఎంఆర్‌టీ రమణారెడ్డి, డీఈఈ రూరల్ రామచంద్రారెడ్డి, డీఈఈ టీఆర్‌ఈఅండ్ ఎస్‌పీఎం సుబ్బారావు, రిమ్స్ ఏఈ రమణ, ఏఈ టీఆర్‌ఈ వీరయ్య, రిమ్స్ సిబ్బంది, టీఆర్‌ఈ, ప్రొటెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత సమ్మర్ కోర్సు

కడప కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మహమ్మదీయ సిద్దిఖ్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో నగర అక్కాయపల్లెలో ఉన్న మహమ్మదీయ సిద్దిఖ్ మసీదులో ఈనెల 25నుంచి వచ్చే మే నెల 24 వరకు ఆధ్యాత్మిక-ధార్మిక ఉచిత సమ్మర్ కోర్సు నిర్వహిస్తున్నట్లు ఆ కమిటీ కన్వీనర్ మగ్బుల్ అహ్మద్ తెలిపారు. పిల్లలకు వేసవి సెలవుల నేపథ్యంలో కోర్సు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు.ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు కోర్సు వుంటుందన్నారు.

జూదరుల అరెస్టు

పులివెందుల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీలో జూద మాడుతున్న ముగ్గురిని అరెస్టుచేసినట్లు అర్బన్ సీఐ చాంద్‌బాష తెలిపారు. వీరిని అరెస్టు చేసి వారికి రూ.2700ఫైన్ విధించామన్నారు. గ్యాంబ్లింగ్‌పైన కఠినంగా వ్యవహరిస్తామని ఆయన పేర్కొన్నారు.

భూసార పరీక్షలు తప్పక చేయించాలి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) :ప్రతి రైతూ తమ పొలంలో భూసార పరీక్షలు తప్పక చేయించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని జంబాపురం గ్రామంలో మట్టి నమూనాలను సేకరించే విధానాన్ని పరిశీలించారు. కమలాపురం మండలానికి 2025-26 సీజన్‌కు గాను మండలం మొత్తానికి 990 మట్టి నమూనాలు, వల్లూరు మండలానికి 528, వీరపునాయునిపల్లె మండలానికి 924, ఎర్రగుంట్ల మండలంకు 858 మట్టి నమూనాలు సేకరించాలని ఉన్నతాధికారులు లక్ష్యం ఇచ్చి ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి దస్తగిరి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాలగిరి మహేశ్వర్‌రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వేముల..: ప్రతి రైతు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో వి.చెన్నారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని కొత్తపల్లె రైతు సేవా కేంద్రం పరిధిలో మట్టి నామూనాలను సేకరించే విధానాన్ని పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులుసంతోష్,వీఆర్‌ఏభాస్కర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో సమానత్వం పాటించాలి

కడప మారుతీనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో సమానత్వం పాటించాలని ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా రాష్ట్ర ఎంఆర్పీఎస్ ఇచ్చిన పిలుపు మేరకు అన్ని కలెక్టరేట్‌ల ఎదుట నిరసన ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా జిల్లా ఎమ్మార్పీఎస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దండు వీరయ్య హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు రామాంజనేయులు, పుల్లయ్య, బాల లక్ష్మయ్య, మహిళానాయకురాలు వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.

డీఈఓ పూల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): డీఈఓ పూల్‌లో మగ్గుతున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితుల ఉన్నతీకరణ సమయంలో గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం వల్ల వందలాది ఉపాధ్యాయులు డీఈఓ పూల్‌లో నెట్టబడ్డారన్నారు. వారంతా పని ఒక ప్రదేశంలో చేస్తూ వేతనాలు మరో ప్రదేశంలో తీసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు.

పీఠాధిపతిని కలిసిన వైసీపీ నేతలు



కడప ఎర్ర ముక్కపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పీఠాధిపతిగా నూతనంగా ఎంపికైన పాల్ ప్రకాష్ సగినాలని మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజాద్‌బాష, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం కడపనగరం మరియాపురంలో పీఠాధిపతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పాకా సురేష్, బాలస్వామిరెడ్డి, మహమ్మద్ షఫీ, మాజీ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్‌కుమార్, నాయకులు రెడ్డయ్య, షఫీఉల్లా, ప్రదీప్, చిట్టి తదితరులు ఉన్నారు.

పేదలకు భూపంపిణీ అమలు చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదల వలసలు నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం భూపంపిణీ అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పేదలతో ధర్నా నిర్వహించారు. ధర్నాకు ముందుగా మహవీర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, పలు మండలాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కడప రైల్వేస్టేషన్‌లో ప్రయాణకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కడపరైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు కోరారు.సోమవారం సాయంత్రం కడప రైల్వేస్టేషన్ వీఐపీ లాంజ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయని ప్రశ్నించారు. అలాగే పనులను నాణ్యతతో పూర్తిచేయాలన్నారు. కడప రైల్వేస్టేషన్ మేనేజర్ శేఖర్‌కుమార్,సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్,స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు జి.లక్ష్మణరావు,పద్మావతి బాయ్, నాగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వేరుశనగలో క్షేత్ర దినోత్సవం



సీకేదిన్నె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వేరుశనగలో క్షేత్ర దినోత్సవం జరిపి పంట పెరుగుదలను రైతులకు వివరించడం జరుగుతుందని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం ఇప్పెంట గ్రామంలో పూజారి సుబ్బయ్య పొలంలో బయోటెక్ కిసాన్ పథకంలో సోమవారం క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసీజీఎస్ (వశిష్ఠ) రకం వేరుశనగను పది ఎకరాలకు పంపిణీ చేయడం జరిగిందని, ఇది తెగుళ్లను తట్టుకునే అన్ని కాలాలకు అనువైన రకం అన్నారు. పంట వేసిన 110 రోజుల్లో చేతికి వస్తుందని ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్లు దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ అంకయ్యకుమార్, కేవీకే శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన

కడపనాగరాజుపేట,ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోత): అరవై ఏళ్లు నిండిన కార్మికులను తొలగించే నిర్ణయానికి వ్యతిరేకంగా కార్పొరేషన్ ఆఫీస్ వద్ద మోకాళ్లపై కూర్చొని తమ నిరసన తెలిపారు. సోమవారం నగర పాలక సంస్థ, మున్సిపల్ కార్మిక సిబ్బంది, సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసనలో కంచుపాటి శ్రీరాములు,ఇత్తడి ప్రకాష్ మాట్లాడుతూ పనిని నమ్ముకొని వచ్చిన ప్రభుత్వం మేలుచేస్తుందని 20, 30ఏళ్లు ఎదురుచూశామన్నారు. ఇపుడు కూటమి ప్రభుత్వం ఒట్టి చేతులతో గెంటివేస్తోందన్నారు. ఆప్కాస్‌ను తొలగించడం దారుణమ న్నారు. ఈ కార్యక్రమంలో సుంకరరవి, కంచుపాటి తిరుపాల్, సుంకర కిరణ్, కొండయ్య, ప్రభాకర్,ఆర్.శ్రీను, నాగరాజు, మహిళా కార్మికులు తదితరులుపాల్గొన్నారు.



తగ్గిన బ్యాక్‌వాటర్.. పది గ్రామాలకు దారి

● త్వరలో రూ.62 కోట్లతో వంతెన ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ● తీరనున్న పదిగ్రామాల ప్రజల కష్టాలు

కొండాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకేపల్లె వద్ద ఉన్న పెన్నానదిలో గండికోట బ్యాక్‌వాటర్ తగ్గుముఖం పట్టింది. దీంతో బొందలదిన్నె- సంకేపల్లె మధ్య ఉన్న పెన్నానది కాజ్‌వేపై పెన్నానది ఆవలి పది గ్రామాలకు రహదారి ఏర్పడింది. ఇందులో సంకేపల్లె, కోడూరు, సిరిగేపల్లె, మురగంపల్లె, ఎర్రగుడి, చామలూరు, కొత్తపల్లె, దొబ్బుడుపల్లె, రాగికుంట, తిరుమలాయపల్లె గ్రామాలకు దారి ఏర్పడటంతో నాలుగైదు రోజుల నుంచి ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. సుమారు పదినెలల నుంచి గండికోటప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటిమట్టం ఉండటంతో ఈ మార్గంలో దారి బంద్ అయ్యింది. దీంతో వంగనూరు, తాడిపత్రి మీదుగా ఈ పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించారు. ఈ మార్గంలో వెళ్లాలంటే సుమారు 60 కిలోమీటర్లు పైగా చుట్టి రావాల్సివస్తోందని ఆయా గ్రామాల వాపోతున్నారు. బ్యాక్‌వాటర్ పూర్తిస్థాయిలో ఉన్నప్పుడల్లా ఇలా చుట్టిరావడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. దీంతో వారి ఇబ్బందులను గుర్తించి గత టీడీపీ ప్రభుత్వం పెన్నానదిపై వంతెన మంజూరు కాగా, వైసీపీ ప్రభుత్వం దానిని ఆటకెక్కించింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పెన్నానదిపై బ్రిడ్జికి మార్గం సుగమమమైంది. ఈ మార్గంలో ప్రజల ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డి లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పెన్నానది పై బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయించారు. దీంతో రూ.62 కోట్లతో త్వరలో పనులు మొదలయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తి జరిగితే పది గ్రామాల ప్రజల కష్టాలు తీరనున్నాయి.



సంకేపల్లె వద్ద పెన్నానది కాజ్‌వేపై తగ్గిన గండికోట బ్యాక్‌వాటర్

వైభవంగా సీతారాముల కల్యాణం

బద్వేలు, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దర్గావీధిలో సీతారామ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణ క్రతువు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. పలువురు భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక అన్న ప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బృందం విచారణ

దువ్వూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నీలాపురం-దాసరిపల్లె గుట్టల ప్రాంతాల్లో సోమవారం ఆక్రమిత భూములపై తహసీల్దార్ల బృందం విచారణ చేశారు. జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ ఆదేశాల మేరకు రెండవ రోజు విచారణ జరిగింది. బృందాలు రెండుగా ఏర్పడి విడివిడిగా విచారణ చేశారు. జమ్మలమడుగు, ఎర్రగుంట్ల తహసీల్దార్లు వారి బృందంతో కలిసి ఈ విచారణ చేసినట్లు దువ్వూరు తహసీల్దారు అక్బర్‌బాష తెలిపారు.

కలసపాడు ఎస్‌ఐగా తిమోతి బాధ్యతల స్వీకరణ

కలసపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కలసపాడు ఎస్‌ఐగా తిమోతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలమల్ల పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఫిజియోథెరపీపై అవగాహన



ఫిజియోథెరపిపై వివరిస్తున్న డాక్టర్ మహేశ్‌కుమార్

అట్లూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అట్లూరు ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి నిజాం ఇనిస్టిట్యూట్ ఫిజియోథెరపి హైదరాబాదు వారు మెడికల్ క్యాంపు నిర్వహించి ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు. డాక్టర్ మహేశ్‌కుమార్, సంతోష్‌కుమార్‌లు ఫిజియోథెరపిపై వివరించారు. అనంతరం నడుం నొప్పులు, మోకాళ్ల నొప్పులకు ఫిజియోథెరపి బెల్టులను సబ్సిడీతో వారికి అందించడం జరిగింది. ఎంపీడీవో భాస్కర్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో చట్టం గురించి అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న జడ్జి భార్గవి

జమ్మలమడుగు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టం గురించి అవగాహన అవసరమని జడ్జి భార్గవి పేర్కొన్నారు. జమ్మలమడుగులోని ప్రభుత్వ వసతి గృహాన్ని జడ్జి భార్గవి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వసతి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 2012లో పోక్సో చట్టం అమలులోకి వచ్చిందన్నారు. ఎక్కడైనా బాలబాలికలను కించపరచినట్లు నిర్ధారణ అయితే పోక్సో చట్టానికి సంబంధించి చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించాం



ఎస్సీ వర్గీకరణ సాధనపై కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ ఉద్యోగ సంఘ నాయకులు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సాధించామని ఎస్సీ ఉద్యోగుల సంఘం నాయకులు కమలాపురం ప్రసాద్, ఎర్రబల్లె ఓబయ్య, శోభన్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో మందక్రిష్ణ చిరకాల వాంఛ ఏబీసీ వర్గీకరణను సుప్రీంకోర్టు ధర్మాసనం ద్వారా సాధించుకునేందుకు తోడ్పడిన ప్రధాని మోదీకి, సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సర్కిల్‌వద్ద కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్ర మంలో సగిలి జాకోబ్, జయచంద్ర, ఈశ్వర్, జయరాములు,సగిలి ప్రకాశ్ పాల్గొన్నారు.

పట్టుకున్న బియ్యం లారీని ఎందుకు వదిలేశారు

● క్రికెట్ బెట్టింగ్ మానేసిన వ్యక్తి మునివరపై కేసు ఎలా పెడతారు.
● పోలీసు అధికారులను ప్రశ్నించిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు రూరల్ పోలీసు లు ఈనెల15న పట్టుకున్న రేషన్ బియ్యం లారీని ఎందుకు వదిలిపెట్టారని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ప్రశ్నించారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ 15 న రూరల్ పోలీసు స్టేషను పరిధిలో బియ్యం బస్తాలు లోడుతో వున్న ఒక లారీని పోలీసులు పట్టుకున్నారని ఆ లారీలో ఉన్న బియ్యం ప్రభుత్వ చౌకదుకాణాలకు సంబంధించిన రేషన్ బియ్యంగా సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున గుర్తించార న్నారు. కానీ ఆ బియ్యం లారీకి బిల్లులు ఉన్నాయని చెప్పి ఈనెల 17 వతేదీన రూరల్ పోలీసులు ఎలా వొదిలేశారన్నారు.ఈ రేషన్ బియ్యం లారీ పై జమ్మలమడుగు తహసీల్దారు రిపోర్టు ఇవ్వడమేమింటని ప్రశ్నిం చారు. నాలుగు ఇళ్లలో వరుసగా చోరీలు జరిగితే కనీసం అక్కడి కి వెళ్లి బాధితులతో మాట్లాడేదానికి డీఎస్పీకి తీరిక లేదా అన్నారు. దొరసాని పల్లె సర్పంచ్ భర్త అరవ మునివరను క్రికెట్ బెట్టింగ్ కేసులో ఎలా పెడతార న్నారు. మునివర 10 ఏళ్లుగా క్రికెట్ బెట్టింగ్ ఆడటం లేదన్నారు.మునివర సెల్‌ఫోన్ అతని భార్య సెల్‌ఫోన్ కాల్ డేటా తీసి అతను క్రికెట్ బెట్టింగ్ ఆడివున్నట్లు ఆదారాలుంటే నిరూపించమన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ గురివిరెడ్డి, మాజీ కౌన్సిలర్ రామాంజనేయులరెడ్డి, ఆనందబార్గవ రెడి,ధనిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్‌పై హర్షం



కేక్ కట్ చేసి టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులకు తినిపిస్తున్న కొండారెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం హర్షణీయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి తెలిపారు. సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా టీఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చంద్రబాబునాయుడు డీఎస్సీ ప్రకటిస్తామని హామీ ఇచ్చి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే డీఎస్సీపై తొలి సంతకం చేశారన్నారు. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజనరీ లీడర్‌గా అని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువనాయకుడు బచ్చల ప్రతాప్, టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కామనూరు రాజేష్, తెలుగుయువత మాజీ అధ్యక్షుడు రెడ్డి సుధీర్, వంశి, రాజు, ప్రతాప్, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ పాఠశాల స్థలం పరిశీలన

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారిమఠం మండలంలోని పలుగురాళ్లపల్లె గ్రామ సమీపంలోని సర్వే నెం.1038లో 20 ఎకరాలు నవోదయ పాఠశాల భవన నిర్మాణం చేపట్టేందుకు స్థలాన్ని బద్వేలు డివిజన్ ఆర్డీవో చంద్రమోహన్ పరిశీలించారు. అనంతరం బ్రహ్మంగారిమఠం తహసీల్దారు కార్యాలయాన్ని పరిశీలించి అక్కడ సిబ్బందితో వీఆర్వో, సర్వేయర్లతో సమావేశమయ్యారు. రెవెన్యూ అధికారులు వెంటనే సర్వేను ప్రారంభించి 20 ఎకరాలు హద్దులను ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టరు శిరీషా, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, డీటీ జాన్సన్‌తో పాటు వీఆర్వోలు, సర్వేయర్లు, రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

దుమ్ముతో ప్రజలకు నరకం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : హైవే కారణంగా దుమ్ము ధూళితో ప్రజలు నరకం చూస్తున్నారని సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్ తెలిపారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ గత ఆరు నెలల నుంచి రోడ్డు పనులు జరుగుతున్నప్పటికీ ఎక్కడ పడితే అక్కడ గుంతలు తీయడం, రోడ్లపై ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, రోడ్డులో కంకర తేలి ప్రజలకు నరకానికి రహదారులు స్వాగతించే విధంగా తయారు చేస్తున్నారని ఆరోపించారు. ఒక సైడ్ పూర్తిగా రోడ్డు అయిపోయాక మరో పక్క రోడ్డు వేయడం చేయాలని, కానీ ఇవేమి పట్టించుకోవడంలేదన్నారు. కడప- విజయవాడ ప్రధాన రహదారి అయినందున ప్రతిరోజు వేల వాహనాలు తిరుగుతున్నాయన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కాశినాయన ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోరుమామిళ్ల సీఐ డి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం ఇటుకులపాడు గ్రామంలో కడప ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు సీఐ డి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీస్ కళాజాత నిర్వహించారు. ఇందులో ఎర్రచందనం అక్రమ రవాణా, దాని నివారణ, సైబర్ నేరాలు రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాజాత ఎస్‌ఐ సుబ్రమణ్యం, కళాజాత బృందం ఇన్‌చార్జి నర్సయ్య ఏఎస్‌ఐ ఖాదరయ్య తదితరులు పాల్గొన్నారు.

వనిపెంట మాజీ సర్పంచ్ మృతి



ఖాజీపేట జాఫర్ హుసేన్

మైదుకూరు రూరల్ ,ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : వనిపెంట మాజీ సర్పంచ్ ఖాజీపేట జాఫర్ హుసేన్(96) సోమవారం తెల్లవారుజామున డీహైడ్రేషన్ వలన మృతి చెందారు. జాఫర్ హుసేన్ ఉపాధ్యాయుడుగా పనిచేశారు. ఆ తరువాత రాజకీయాలలో చేరి ఎంపీటీసీ, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడిగా, మాజీ సర్పంచ్‌గా పనిచేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, రెడ్యం వెంకట సుబ్బారెడ్డిలు సంతాపం తెలియచేశారు.

వృత్తి విద్యా కోర్సు సర్టిఫికెట్ల పంపిణీ

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో వృత్తి విద్యా కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్లను హెచ్‌ఎం. రామాంజనేయరెడ్డి పంపిణీ చేశారు. వృత్తి విద్యా కోర్సుతోపాటు ప్రత్యేకంగా ఐటీఐ, ఇతర చోట్ల కంప్యూటర్, కోఫా కోర్సులలో ఇంటర్న్‌షిప్ నిర్వహించారు. ఈ కోర్సులతో మరింత పరిజ్ఞానాన్ని పొందారని ఉపాధ్యాయుడు చంద్ర ఓబుళరెడ్డి పేర్కొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు టిప్పర్ల పట్టివేత

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తవ్వకాలు జరిపి నంద్యాలకు తరలిస్తున్న రెండు టిప్పర్లను రూరల్ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం రూరల్ పోలీసులు టిప్పర్లను తహసీల్దారు కార్యాలయంకు తీసుకువచ్చి ఇసుక అన్‌లోడ్ చేశారు. టిప్పర్లను తహసీల్దారు కార్యాలయం ఆవరణలో పెట్టగా రెవెన్యూ అధికారులు రికార్డులు పరిశీలించి ఒక్కో టిప్పరు మీద భారీ జరిమానా వేయనున్నట్లు డీటీ సాయినాధ్‌రెడ్డి తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం

ఖాజీపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కడప- కర్నూలు జాతీయ రహదారిలోని దుంపలగట్టు సమీపంలో కారు డివైడర్‌ను ఢీకొనింది. హైదరాబాదుకు చెందిన ఎం.వంశీకృష్ణ కుటుంబ సభ్యులతో తిరుమలకు వెళుతుండగా దుంపలగట్టు సమీపంలోకి రాగానే స్కూటర్ అడ్డు రావడంతో కారు డివైడర్‌ను ఢీకొంది. అందులో ప్రయాణిస్తున్న కుటుంబ సభ్యులు క్షేమంగా బయటపడడంతో తృటిలో ప్రమాదం తప్పింది.

ప్రీ మాన్ సూన్ డ్రై సోయింగ్‌తో భూమి సారవంతం



పొలంలో ప్రయోగాత్మకంగా విత్తనాలు చల్లుతున్న వ్యవసాయాధికారులు

ముద్దనూరు ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): ప్రీమాన్ సూన్ డ్రై సోయింగ్ పద్ధతిన భూమి సారవంతమవుతుందని, అంతే కాకుండా దిగుబడి కూడా పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి రైతులకు సూచించారు. మండల పరిధి రాజులగురువాయపల్లె గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ప్రీ మాన్ సూన్ డ్రై సోయింగ్(పీఎండీఎస్)పద్ధతిన విత్తనం చల్లే కార్యక్రమం ప్రయోగాత్మకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ..రుతుపవనాల కంటే ముందుగా 32 రకాల విత్తనాలను పొడి నెలలో సాగు చేయవచ్చన్నారు. ఇందులో పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజలు, ఆకుకూరలు విత్తనాలను బీజామృతం, బంకమట్టి తదితర వాటితో విత్తన శుద్ధి చేసి చల్లటం జరిగిందన్నారు.దాదాపు 6నెలల కాలం విత్తనం భూమి లోపల బీజం దెబ్బతినకుండా వర్షం పడినప్పుడు మొలకెత్తుతుందన్నారు. మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మేరీ, నూజహత్, రామసుధ, రమణ,శ్రీదేవి, పుష్పలత, యమున రైతులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలి

బి.కోడూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : బడి ఈడు పిల్లలు బడిలో ఉండేలా 2025-26 విద్యాసంవత్సరానికి ఈనెల 23వతేదీల్లోగా విద్యార్థులను చేర్పించాలని విద్యాశాఖ అధికారులు పుల్లయ్య, సునీల్‌కుమార్‌లు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కోరారు. సోమవారం మండల పరిధిలోని రామచంద్రపురం మోడల్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించి అక్కడున్న అంగన్వాడీ పాఠశాల విద్యార్థులను 1వతరగతిలో చేర్పించారు. అదే పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు కొంతమందిని కస్తూర్బా పాఠశాల, ఐత్రంపేట జిల్లా పరిషత్ హైస్కూలులో చేర్పించేందుకు ఏర్పాట్లు చేశారు. మోడల్ ప్రాథమిక పాటశాల ఆవిర్భవించిన రామచంద్రాపురం ప్రాథమికపాఠశాలకు రాబోయే విద్యాసంవత్సరంలో విద్యార్థుల సంఖ్య కనుగుణంగా నలుగురు ఉపాధ్యాయులు పనిచేస్తారన్నారు. ఐదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు బాలసుబ్బయ్య, ఉపాధ్యాయులు రమణమూర్తి, మేరీఫ్లారెన్స్ , రాజశేఖర్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని అందువల్ల తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సోమవారం ఎంఈవోలు శివప్రసాద్, రామాంజనేయరెడ్డిలు కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు పాఠశాలల కన్నా ఇంగ్లీషు మీడియం, అర్హత, అనుభవం గల ఉపాధ్యాయులు, ఆటలు, పాటలు, స్నేహపూర్వక వాతావరణం, డిజిటల్ బోధన, ప్రతి విద్యార్థికి ఉచిత పుస్తకాలు, బూట్లు, బట్టలు, రుచికరమైన మధ్యాహ్నభోజనం, ప్రభుత్వ స్కాలర్‌షిప్పులు ఇస్తున్నట్లు తెలిపారు. విజ్ఞాన విహార యాత్రలు, మినరల్ వాటర్, ఉచిత వైద్య పరీక్షలతో కూడిన సకల సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నాయని ప్రజలు గమనించి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు.

ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల చేరిక



పిల్లలకు అడ్మిషన్లు చేయిస్తున్న దృశ్యం

అట్లూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) :ప్రస్తుత విద్యాసంవత్సరంలో ప్రభుత్వ ఆదర్శ పాఠశాల్లో 1 నుంచి 5వతరగతి వరకు పిల్లలను చేర్పించాలనే ఉద్దేశ్యంతో సోమవారం 50 మందిని చేర్పించినట్లు ఎంఈవో విలియంరాజు తెలిపారు. 'బడి బాట ఎక్కడికె ఎందుకు దండగ, ప్రభుత్వ బడి మన ఊరిలో ఉండగ' అంటూ గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ ప్రైవేటు బడుల కన్నా ప్రభుత్వ బడులు మిన్న అంటూ ప్రచారం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రతిరోజూ నాణ్యమైన భోజనం, మూడు జతల యూనిఫాంలు ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని తల్లిదండ్రులకు వివరించి సోమవారం ఆదర్శ పాఠశాలలో 50 మంది విద్యార్థులను ఎంపీడీవో, అట్లూరు హెచ్‌ఎం అశ్వర్థరెడ్డి ఆధ్వర్యంలో అడ్మి షన్లు చేయించినట్లు ఎంఈవో తెలిపారు.

ఉన్నతాధికారులచే పశువైద్యశిబిరం ఏర్పాటు



మేకలకు వైద్యపరీక్షలు అందిస్తున్న జిల్లా ఉన్నతాధికారులు

బి.కోడూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రెడ్డివారిపల్లె గ్రామంలో చనిపోతున్న మేకలను, గొర్రెలను దృష్టిలో పెట్టుకుని జిల్లా పశువైద్య ఉన్నతాధికారులు పశు వైద్య శిబిరం ఏర్పాటు చేసి మేకలు, గొర్రెలకు వైద్య చికిత్సలు చేశారు. ఇందులో జిల్లా పశు వెద్య ఉన్నతాధికారి రమణయ్య, కడప పశువ్యాధి నిర్ధారణ ల్యాబ్ అధికారి రాంబాబు, బి.మఠం ఏడీ వెంకటసుబ్బయ్య సోమవారం వైద్యసిబ్బంది పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి గొర్రెలు, మేకల నుంచి రక్త నమూనాలు, పేడ నమూనాలు సేక రించి కడప ల్యాబ్‌కు పరీక్ష నిమిత్తం తీసుకెళ్లారు. జిల్లా వైద్యాధికారి రమణయ్య రైతులతో మాట్లాడుతూ జీవాలు జబ్బు నుంచి కోలుకునేంత వరకు గ్రామంలో వైద్యాధికారులు పర్యటిస్తూ వైద్యమందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ పశువైద్యాధికారి లక్ష్మి నరసయ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

220 పశువులకు ఉచిత వైద్య చికిత్స



పశువులకు ఉచితంగా మందులను అందజేస్తున్న డాక్టర్ ఇందిర

మైదుకూరు రూరల్ ,ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఉచిత పశు వైద్య శిబిరంలో 220 పశువులకు సోమవారం పశు వైద్య కళాశాల విద్యార్థులు చికిత్సలు చేశారు. మైదుకూరు మండలంలోని వనిపెంటలో ప్రొద్దుటూరు పశువైద్య కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా పశువులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో గర్భకోశ వ్యాధులు, చూడి నిర్ధారణ పరీక్షలు, నట్టల నివారణ మందులు తదితర పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య కళాశాల డాక్టర్లు ఇందిర, పృద్వీధర్‌రెడ్డి, సమిరన్, రాజు, దీపిక తదితరులు పాల్గొన్నారు.

పోషకవిలువలతో కూడిన ఆహారం ఎంతో మేలు



పోషన్‌పక్వాడ్ కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ

కొండాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్ర జ్యోతి): పోషకవిలువలు కూడిన ఆహారంతో అనేక ప్రయోజనాలున్నాయని సీడీపీఓ ముంతాజ్‌బేగం తెలిపారు. మండలంలోని టి.కోడూరు, ఎస్.కొత్తపల్లె, చామలూరు, ఎర్రగుడి అంగనవాడీ కేంద్రాలలో సోమవారం పోషన్‌పక్వాడ్ నిర్వహించారు గర్భవతులు, బాలింతలు చిన్నపిల్లలు పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ప్రయోజనం ఉంటుందని సీడీపీవో తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీవర్కర్లు పద్మావతి , ఆదిలక్ష్మి, సింధు, ఎర్రమ్మ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు వితరణ



కాశినాయన ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): నర్సాపురం గ్రామంలో అనారోగ్యంతో మంచానికి పరిమితమైన గోసుల సుబ్బమ్మ, మాయలూరి శ్రీదేవిలకు సోమవారం ఓబుళాపురం సమీపంలోని వివేకానంద సేవా సమితి వ్యవస్థాపకుడు రామక్రిష్టారెడ్డి నిత్యావసర సరుకులు అందజేశాడు. గోసుల సుబ్బమ్మ షుగర్ వ్యాధితో కాలుకు ఆపరేషన్ చేయిం చుకోగా మాయలూరి శ్రీదేవి పక్షవాతంతో మంచానికి పరిమితమయ్యారు. విషయం తెలుసుకున్న రామక్రిష్టారెడ్డి ఇరువురికి 4 బియ్యం ప్యాకెట్‌లు, ప్యాన్‌లు బట్టలు, ఇతర నిత్యావసర సరుకులు ఇచ్చి భరోసా కల్పించారు.

25న మండల సర్వసభ్యసమావేశం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమణారెడ్డి తెలిపారు. ఈ మండల సమావేశంలో అన్ని శాఖల పనితీరుపై రివ్యూ ఉంటుందన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, మండల స్థాయి అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.